Follow: @ANNTELUGU
02-04-2025
ANN తెలుగు
మహా పత్రిక
బుధవారం, హైదరాబాద్ సంపుటి- 22 సంచిక- 121 పేజీలు-08 వెల-రూ.6
PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM



## శ్రేయాస్, నేహాల్ వధేరా విధ్వంసక ఇన్నింగ్స్

### చిత్తుగా ఓడిన లక్నో

ఐపీఎల్ 18వ సీజన్‌లో పంజాబ్ కింగ్స్ రెండో విజయం సాధించింది. తొలిపోరులో గుజరాత్ టైటన్స్‌కు షాకిచ్చిన పంజాబ్.. లక్నో వేదికగా లక్నో సూపర్ జెయింట్స్‌ను చిత్తు చేసింది. స్వల్ప ఛేదనలో ఓపెనర్ ప్రభ్‌సిమ్రాన్ సింగ్(69), కెప్టెన్ శ్రేయాస్ అయ్యర్(52 నాటౌట్ : 34 బంతుల్లో 3 ఫోర్లు, 4 సిక్సర్లు), ఇంప్యాక్ట్ ప్లేయర్ నేహల్ వధేరా(43 నాటౌట్ : 25 బంతుల్లో 3 ఫోర్లు, 4 సిక్సర్లు) ధనాధన్ ఆడారు. వీరిద్దరి మెరుపులతో లక్నోపై 8 వికెట్ల తేడాతో జయకేతనం ఎగురవేసింది పంజాబ్. 16.2 ఓవర్లలోనే లక్ష్యాన్ని ఛేదించింది. ఏకపక్ష పోరులో లక్నోపై 8 వికెట్ల తేడాతో జయకేతనం ఎగురవేసి నాలుగు పాయింట్లు ఖాతాలో వేసుకుంది పంజాబ్. మిగతా 2లో

టాప్ న్యూస్

### కంచె గచ్చిబౌలి భూములపై తక్షణమే నివేదిక ఇవ్వండి

- కేంద్ర మంత్రి భూపేంద్ర యాదవ్ ఆదేశాలు



02

### ఉప్పల్ స్టేడియంలో విజిలెన్స్ విచారణ

- వివాదాలన్నీ ముగిశాయని ప్రకటించిన హెచ్‌సీఏ-ఎస్ఆర్‌హెచ్

02

### బీఆర్ఎస్ సభ కోసం ప్రజలు ఎదురుచూస్తున్నారు

- పాలన వింతగా ఉంది
- మార్పు కోరుకున్న రైతుల కళ్లల్లో కన్నీళ్లే
- వరంగల్ నేతలతో కేసీఆర్ సంచలన కామెంట్స్



02



### భూ భారతి చట్టంతోనే భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం

- ఖమ్మంలో విలేకరుల సమావేశంలో తెలంగాణ ఉద్యోగ జేఏసీ చైర్మన్ వి.లచ్చిరెడ్డి
- ప్రజా ప్రభుత్వంలో భూ సమస్యలు లేని గ్రామాలే మా లక్ష్యం
- గ్రామీణ రెవెన్యూ వ్యవస్థ బలోపేతం కోసమే 10,954 మంది జీపీఓల నియామకం
- మా ఆత్మగౌరవం కాపాడిన ప్రజా ప్రభుత్వానికి, జేఏసీ చైర్మన్ లచ్చిరెడ్డి కి రుణపడి ఉంటాం
- జీపీఓల రాష్ట్ర అధ్యక్షులు గరికె ఉపేంద్ర రావు


వివరాలు 2లో



### దునియా చూపు.. తెలంగాణ వైపు...

- అదిరేటి డ్రెస్సు మేమేస్తే.. అంటూ అతిలోకసుందరిల రాక
- తెలంగాణ జరూర్ ఆనా.. మిస్ వరల్డ్ బ్యూటీకో దేఖోనా
- 140 దేశాల నుంచి సుందరీమణులు
- మే 7 నుంచి 31 వరకు జరగనున్న పోటీలు
- తెలంగాణ ఆతిథ్యం.. ప్రపంచానికి ఇక్కడి ఆనంద దృశ్యం

వివరాలు 4లో



### మహేష్ -రాజమౌళి మూవీపై అప్ డేట్

- సోషల్ మీడియాలో ట్రెండింగ్
- ఈనెలలో ప్రెస్ మీట్ ఉంటుందంటూ ఫ్యాన్ పోస్టర్

**మహా:** పాన్ వరల్డ్ డైరెక్టర్ రాజమౌళి, సూపర్ స్టార్ మహేష్‌బాబు తో తీస్తున్న మహేష్‌బాబు మూవీకి సంబంధించి ఇప్పటిదాకా అప్ డేట్ ఏదీ లేకున్నా అభిమానులు లీకులతో బతికేస్తున్నారు. తోచింది ట్రెండ్ చేసుకుంటూ ఆనంద పడుతున్నారు. ఓవైపు మరో భారీ షెడ్యూల్ ప్రారంభమైందంటూ ప్రచారాల నడుమ ఈనెల 19న సినిమా టీమ్ ప్రెస్ మీట్ ఉండబోతున్నదంటూ పోస్టర్ వదిలారు. ఈ పోస్టర్‌తో ఎస్ఎస్ ఎంబి 29 మళ్ళీ టాప్ ట్రెండింగ్‌లోకి వెళ్ళిపోయింది. ఈ అప్ డేట్ నిజమా కాదా తెలియదు కానీ అభిమానులు మాత్రం జోరుగా రీట్వీట్లు చేస్తున్నారు. ఈ ప్రాజెక్టుపై ఆకాశాన్నంటే అంచనాలున్నాయి.

# భూ.. రచ్చ

## ఆ భూమితో ఊపిరి తీసుకోవాలని సర్కార్

అడ్డుకునేందుకు విపక్షాల హోరాహోరీ.. 400 ఎకరాలు చుట్టూ వివాదం

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన అత్యవసర మంత్రివర్గ సమావేశం

విపక్షాల ఎత్తుగడలను తిప్పికొట్టాలని నిర్ణయం

భూమిలో డెవలప్ మెంట్ పనులపై బీజేపీ ఆగ్రహం.. కేంద్రమంత్రులకు ఫిర్యాదులు


మైహోం విహంగకు బీఆర్ఎస్ 25 ఎకరాలు దొడ్డిదారిన కట్టబెట్టింది : ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్

**హైదరాబాద్, మహా:** కంచె గచ్చిబౌలి చుట్టూ వివాదం ముసురుకుంది. ఎంతో పోరాడి ఐఎంజి నుండి భూమిని కాపాడిన రాష్ట్ర ప్రభుత్వానికి విపక్షాల నిందలు, సామాజిక మాధ్యమాల ద్వారా క్రియేట్ చేసిన విధ్వంసం తలనొప్పిగా మారింది. గత ప్రభుత్వాల్లా స్వప్రయోజనాలు ఆశించకుండా.. రూ.20వేల కోట్లకు పైగా విలువైన భూమిని కాపాడితే ఈ విపక్షాల రాజకీయమేంటని సర్కారు మండిపడుతోంది. ఓ వైపు ఇది యూనివర్శిటీ భూమేనంటూ హెచ్ సి యు విద్యార్థులను కవ్వించడంతో పాటు బిఆర్ఎస్, బిజెపి ఆందోళనలు సర్కారును షాక్‌కు గురిచేశాయి. గతంలో చంద్రబాబు, వైఎస్ ఆర్, కేసీఆర్ భూముల వేలం ద్వారా ఆదాయం సమకూర్చుకుని, కొత్త పథకాలు ప్రారంభించడం.. ఆర్థిక ఇబ్బందుల నుండి బయటపడడం చేయగా, ఈ సర్కారును మాత్రం ఎలాంటి ముందడుగు వేయకుండా అటు బీఆర్ఎస్, ఇటు బీజేపీ ఇరుకున పెట్టే ప్రయత్నం చేస్తున్నారన్న విమర్శలు విశ్లేషకుల నుండి వినబడుతున్నాయి. ఈ భూమితో సర్కారుకు ఊపిరి అందుతుందని, ఇక సంక్షేమానికి తిరుగుండదని భావిస్తున్న ఓ విపక్షపార్టీ.. ఊపిరి అందకుండా ఇక్కట్ల పాలు చేయాలని అధికారం కోసం అడ్డగోలు ప్రచారం చేస్తున్నదని అధికారపార్టీ మండిపడుతోంది. వివాదం మరింత ముదరకముందే ప్రభుత్వం అప్రమత్తం కావడంతో పాటు మంత్రివర్గం అత్యవసరంగా సమావేశమైంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన కమాండ్ కంట్రోల్ సెంట్రల్ లో జరిగిన సమావేశంలో ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో పాటు మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, జూపల్లి క్రిష్ణారావు, సీతక్క తదితర మంత్రులంతా హాజరయ్యారు. మిగతా 2లో

### హైకోర్టులో నేడు విచారణ

కాగా కంచె గచ్చిబౌలి భూములపై తెలంగాణ హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. ఈ పిల్‌ను న్యాయస్థానం స్వీకరించింది. బుధవారం విచారణ జరగనుంది. ఆ 400 ఎకరాలు హెచ్‌సీయూ భూమి అని, అటవీ భూమిలో వన్య మృగాలకు ఆవాసం ఉండదని తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ క్రమంలో వట ఫౌండేషన్ 400 ఎకరాల వివాదాస్పద భూముల వ్యవహారంపై ప్రజా ప్రయోజన వాజ్యం దాఖలు చేసింది. కంచె గచ్చిబౌలి భూములను జాతీయ ఉద్యానవనంగా ప్రకటించాలని పిటిషన్‌లో కోరారు. అత్యవసరంగా పిటిషన్ స్వీకరించి విచారణ చేపట్టాలని వట ఫౌండేషన్ లాయర్ కోరారు. బుధవారం ఈ పిటిషన్‌ను విచారిస్తామని న్యాయస్థానం పేర్కొంది.





## బీసీల మహా ధర్నాకు రాహుల్ గాంధీ

### ఢిల్లీలో తెలంగాణ బీసీ ఉద్యమం

ధర్నాలో పాల్గొనేందుకు ఢిల్లీ చేరుకున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, టీపీసీసీ చీఫ్ మహేష్ గౌడ్

**హైదరాబాద్, మహా:** ఢిల్లీ కేంద్రంగా రాజకీయాలు వేడెక్కాయి. హలో బీసీ ఛలో ఢిల్లీ అంటూ బీసీసంఘాలు ఢిల్లీలో మహా ధర్నాకు పిలుపునివ్వగా, లోక్ సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ ఈ ఆందోళనకు హాజరవుతున్నారు. ఉదయం 9.30కు రాహుల్ ఈ ధర్నాలో పాల్గొంటారు. బీసీ మహా ధర్నా నేపథ్యంలో తెలంగాణకు సంబంధించిన కీలక నేతలంతా ఢిల్లీలో ప్రత్యక్షమయ్యారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ సహా పలువురు మంత్రులు పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ సహా ఎమ్మెల్యేలు ఢిల్లీ వెళ్ళారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లపై చారిత్రాత్మక బిల్లు పెట్టిన తెలంగాణ ప్రభుత్వం బంతిని కేంద్రప్రభుత్వ కోర్టులోకి నెట్టింది. కేంద్రంపై ఒత్తిడి పెంచే వ్యూహంలో భాగంగా బుధవారం ఢిల్లీలో బీసీ సంఘాలు మహా ధర్నాకు పిలుపునివ్వగా, కాంగ్రెస్ ముఖ్యనేతలంతా సంఘీభావంగా రానున్నారు. పార్లమెంట్ లో చట్టం ద్వారానే ఉద్యోగాల్లో, రాజకీయ పదవుల్లో 42 శాతం రిజర్వేషన్లు దక్కనున్నాయని, కేంద్రం దిగివచ్చి తెలంగాణ ప్రభుత్వం తరహాలో చట్టం చేయాలని బీసీ సంఘాలు డిమాండ్ చేయనున్నాయి. రాహుల్ గాంధీ స్వయంగా ఆందోళనలో పాల్గొంటుండడంతో బీసీ ఉద్యమానికి మరింత ఊపు లభించినట్లయింది.




### విద్యార్థుల పోరు.. అట్టుడికిన హెచ్‌సీయూ

**హైదరాబాద్, మహా:** విద్యార్థుల పోరుతో హైదరాబాద్ సెంట్రల్ యూనివర్శిటీ అట్టుడుకుతోంది. వివాదాస్పద స్థలం 400 ఎకరాల్లో బుల్డోజర్లు చదును ప్రారంభించిన నాటినుండీ ఒక్కసారిగా ఆందోళన బాట పట్టిన విద్యార్థులు పగలు, రాత్రి కూడా ఆందోళనలు కొనసాగిస్తూ యూనివర్శిటీని అట్టుడికిస్తున్నారు. విద్యార్థుల ఆందోళన నేపథ్యంలో ఓ వైపు మంత్రివర్గం అత్యవసరంగా సమావేశం కాగా, విద్యార్థులతో మరోసారి చర్చించి వాస్తవాలు వివరించాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి శ్రీధర్ బాబు నిర్ణయించారు. వారం క్రితం కూడా ఓసారి హెచ్ సి యు అధికారులతో మంత్రులు భేటీ అయినట్లు తెలిసింది.

## మయన్మార్‌లో ఆగని మృత్యుఘోష

### 2700 దాటిన మరణాలు.. ఇంకా తేలని లెక్కలు



**మహా:** మయన్మార్ భూకంప ( మృతుల సంఖ్య అంతకంతకే పెరుగుతోంది. భూకంపం సంభవించిన ప్రాంతంలో రెస్క్యూ ఆపరేషన్ ముమ్మరంగా సాగుతోంది. శిథిలాలను తొలగించినా కొద్ది మృతదేహాలు బయటపడుతున్నాయి. ఇప్పటివరకు 2,719 మంది మృతదేహాలను వెలికితీశారు. స్థానిక మీడియా తాజాగా ఈ విషయాన్ని వెల్లడించింది. మృతుల్లో 5 ఏళ్లలోపు చిన్నారులు 50 మంది ఉన్నారని తెలిపింది. మరో 4,521 మంది గాయపడ్డారని, ఇంకో 441 మంది ఆచూకీ లభ్యం కావాల్సి ఉందని పేర్కొంది. ఇప్పటికే సైనిక పాలన, అంతర్యుద్ధాలతో మగ్గిపోతున్న మయన్మార్‌పై గత శుక్రవానం సంభవించిన భూకంపం తీవ్ర ప్రభావాన్ని చూపించింది. భారీగా ప్రాణ, ఆస్తి నష్టానికి కారణమైంది. కొన్ని ప్రభావిత ప్రాంతాలకు సహాయక బృందాలు చేరుకోవడం కూడా కష్టంగా ఉంది. దాంతో శిథిలాల కింద చిక్కుకున్న వారిని బయటికి తీసుకురావడం ఆలస్యమవుతోంది.

## రేపే మంత్రివర్గ విస్తరణ?

### రాజగోపాల్ రెడ్డికి రంగారెడ్డి జిల్లా గండం

శ్రీహరి, వివేక్, సుదర్శన్ రెడ్డి ఖరారు..

రాజగోపాల్ రెడ్డి లేదా రంగారెడ్డి నేతల్లో ఒకరికి ఛాన్స్

పలువురి శాఖల్లో మార్పులు చేర్పులు



**హైదరాబాద్, మహా :** మంత్రివర్గ విస్తరణపై హైకమాండ్ ఇదివరకే నిర్ణయం తీసుకోగా, నాలుగు పేర్లకు సంబంధించి గతంలోనే ఫైనల్ చేసినట్లు ఢిల్లీ వర్గాలు చెబుతున్నాయి. నిజామాబాద్ నుండి సుదర్శన్ రెడ్డి, ఆదిలాబాద్ నుండి గడ్డం వివేక్, మహబూబ్ నగర్ నుండి శ్రీహరి, నల్లగొండ నుండి కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి దాదాపు ఖరారు కాగా, రాజగోపాల్ రెడ్డికి ఓ వైపు ఒకే ఫ్యామిలీలో ఒకే పదవి ఇవ్వాలని హైకమాండ్ పై ఒత్తిళ్ళు.. మరోవైపు రంగారెడ్డి నేతల ఒత్తిడితో అయోమయంలో పడినట్లు తెలిసింది. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ కూడా కుటుంబంలో ఒక్కరికే మంత్రిపదవిని ఇవ్వాలని సూచించినట్లు ప్రచారం జరుగుతోంది. అయితే ట్రాక్ రికార్డు, హామీలను పరిగణనలోకి తీసుకుంటే బుధవారం రాత్రి వరకు దీనిపై స్పష్టత వచ్చే అవకాశముంది. మరోవైపు రంగారెడ్డి జిల్లానేతలు ఐక్యంగా మంత్రి పదవి కోసం పట్టుబడుతున్నారు. మిగతా 2లో

# భూ..రచ్చ

(మొదటిపేజీ తరువాయి)

ఈ సందర్భంగా కంచె గచ్చిబౌలికి సంబంధించి ప్రజలకు వాస్తవాలు వివరించాలని నిర్ణయించారు. దుష్ప్రచారం చేసేవారిపై కఠినంగా వ్యవహరించాలని అధికారులను ఆదేశించారు. విద్యార్థులతో చర్చించి వాస్తవాలు వివరించాలని కేబినెట్ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు బాధ్యత అప్పగించింది. మరోవైపు కంచె గచ్చిబౌలిలో 25 ఎకరాల భూమిని అన్యాయంగా మైహోం రామేశ్వరరావుకు కట్టబెట్టారని, మైహోం విహంగ నిర్మించారంటూ ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ ఆరోపించారు. మంగళవారం ఆందోళన నిర్వహించారు.

**హెచ్ సియు భూమి అంగుళం కూడా వద్దు - డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క**



హైదరాబాద్ సెంట్రల్ యూనివర్శిటి భూముల వివాద నేపథ్యంలో ఆ వర్శిటీ భూములను ప్రభుత్వం తీసుకోవడం లేదని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ప్రకటించారు.. ఆ భూముల విషయంలో కొన్ని రాజకీయ పార్టీలు, వాటి అనుబంధ సంఘాలు వివాదం చేస్తున్నాయని మండిపడ్డారు.. కావాలనే విద్యార్థులను రెచ్చగొడుతున్నారంటూ ఆరోపించారు.. ఈ వివాదాల నేపథ్యంలో మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుతో కలసి ఆయన మీడియాతో మాట్లాడారు. అక్కడ భూములలో ఉన్న చెరువులను,జీవ వైవిధ్యాన్ని కాపాడతామని అన్నారు.. వర్శిటీ భూములను లాక్కుంటున్నట్లు విష ప్రచారం చేస్తున్నారని అన్నారు.. ఇందులో ఎటువంటి నిజం లేదన్నారు భట్టి.. ఈ భూముల విషయంలో నిజాలు ప్రజలకు తెలియాలనే అన్ని విషయాలు మీడియా ముఖంగా చెబుతున్నామన్నారు. కంచె గచ్చిబౌలిలోని సర్వే నంబర్ 25లోని 400 ఎకరాల భూమి ముమ్మాటికి ప్రభుత్వ ఆస్తి అని మంత్రి శ్రీధర్ బాబు పేర్కొన్నారు. బీఆర్ఎస్, బీజేపీ తమ స్వార్థ రాజకీయాల కోసం కావాలనే అందర్నీ తప్పుదోవ పట్టిస్తున్నారని.. ఇది వారికి తగదన్నారు. రాష్ట్ర ప్రగతిని అడ్డుకునేలా రాజకీయాలు చేయడం మంచిది కాదన్నారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీకి చెందిన ఒక్క ఇంచు భూమిని కూడా ప్రభుత్వం కబ్జా చేయలేదన్నారు. ఇప్పటివరకూ ఒక్క ఎకరం భూమిపై కూడా యూనివర్సిటీకి చట్టబద్ధ హక్కులు లేవు.. ఈ సమస్యను పరిష్కరించాలని యూనివర్సిటీ విద్యార్థులు, సిబ్బంది ఎప్పటి నుంచో కోరుతున్నారు. కానీ.. బీఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉన్నపుడు పట్టించుకోలేదు.. ఇప్పుడేమో పని గట్టుకొని మాపై దుష్ప్రచారం చేస్తున్నారన్నారు. వారం రోజుల కిందట యూనివర్సిటీ వీసీ, రిజిస్ట్రార్‌తో మేం ప్రత్యేకంగా సమావేశమయ్యాము. వారి విజ్ఞప్తి మేరకు మా ప్రభుత్వం యూనివర్సిటీకి భూములపై నిబంధనల ప్రకారం చట్టబద్ధ హక్కులు కల్పించేందుకు చొరవ తీసుకున్నామని తెలిపారు.

**హెచ్ సీయూ భూముల వేలానికి కేంద్రం అనుమతి తీసుకోవాలి- కేంద్ర మంత్రి బండి సంజయ్**

గచ్చిబౌలి భూములపై కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం వేలం వేయాలనుకున్న 400 ఎకరాల భూమి అటవీ పరిధిలోనిదని, అటవీ లక్షణాలు కలిగిన ఏ భూమినైనా కేంద్ర ప్రభుత్వ ఆమోదం లేకుండా నరికివేయలేమని సుప్రీం కోర్టు తీర్పులున్నాయన్నారు. కంచె గచ్చిబౌలిలోని 400 ఎకరాల భూమికి సంబంధించి హైకోర్టులో కేసు నడుస్తోందని, వట ఫౌండేషన్ అనే ఎన్‌జీవో దాఖలు చేసిన కేసులో ఏప్రిల్ 7 నాటికి కౌంటర్ దాఖలు చేయాలని హైకోర్టు రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించిందన్నారు. ఆ భూములను వేలం వేయడం కుదరదని.. ఈ విషయం తెలిసి కూడా రాష్ట్ర ప్రభుత్వం భూముల చదును పేరుతో కోర్టు ధిక్కారణకు పాల్పడుతోందని బండి సంజయ్ విమర్శించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని మించి కాంగ్రెస్ ప్రభుత్వం దుర్మార్గంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. ప్రజా ప్రయోజనాలకు కాకుండా ప్రభుత్వ భూములను అడ్డగోలుగా విక్రయించడాన్ని రేవంత్ రెడ్డి గతంలో వ్యతిరేకించిన సంగతి మర్చిపోయారా అని ప్రశ్నించారు

## విద్యార్థుల ముసుగులో బీఆర్ఎస్ అరాచకం

**మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఫైర్**

హైదరాబాద్, మహా: విద్యార్థుల ముసుగులో బీఆర్ఎస్‌వ్యక్తులు అరాచకానికి పాల్పడుతున్నారని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఆరోపించారు. హెచ్‌సీయూ భూముల అంశంపై రాద్ధాంతం చేస్తున్న వారికి హెరిటేజ్ బిల్డింగులకు అనుమతి ఇచ్చేటప్పుడు పర్యావరణం గుర్తుకురాలేదా? అని ప్రశ్నించారు. ఈ భూముల్లోని జంతువులు, పక్షులకు ఎలాంటి హాని జరగలేదని చెప్పారు. జంతువులు చనిపోయినట్లు సోషల్ మీడియాలో చూపుతున్న చిత్రాలు పాతవని స్పష్టం చేశారు. మంత్రులు భట్టి విక్రమార్క, శ్రీధర్‌బాబు హెచ్‌సీయూ పూర్వ విద్యార్థులేనన్నారు. అక్కడి బండరాళ్లు, చెరువులకు ఎలాంటి నష్టం జరగనివ్వబోమని తెలిపారు.

## ముమ్మాటికీ ప్రభుత్వ ఆస్తి.. మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు

హైదరాబాద్ శివారు కంచ గచ్చిబౌలి సర్వే నంబర్ 25లోని 400 ఎకరాల భూమి ముమ్మాటికీ ప్రభుత్వ ఆస్తి అని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు స్పష్టం చేశారు. హైదరాబాద్‌సెంట్రల్ యూనివర్సిటీకి సంబంధించి కొన్ని అపోహలు, ఆ భూమికి సంబంధించిన అనుమానాలు దానికి తోడు అక్కడ గందరగోళం సృష్టించేందుకు బీజేపీ, బీఆర్ఎస్‌నేతలు ప్రయత్నిస్తున్నారని.. వాస్తవ వివరాలు ప్రజలకు తెలిపేందుకే తాము ముందుకు వచ్చామన్నారు. రాష్ట్ర ప్రగతిని అడ్డుకునేలా రాజకీయాలు చేయడం మంచిది కాదని సూచించారు. ఈ 400 ఎకరాల భూమికి సంబంధించి ఇప్పటివరకూ ఒక్క ఎకరం భూమిపై కూడా హెచ్‌సీయూకు చట్టబద్ధ హక్కులు లేవన్నారు. ఈ సమస్యను పరిష్కరించాలని విద్యార్థులు, సిబ్బంది ఎప్పటి నుంచో కోరుతున్నా బీఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు పట్టించుకోలేదన్నారు. ఇప్పుడేమో పని గట్టుకొని తమపై దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. నేచురల్ రాక్ ఫార్మేషన్స్, సహజ సిద్ధంగా ఏర్పడిన నీటి వనరులను కనుమరుగు చేస్తున్నామంటూ కొందరూ దుష్ప్రచారం చేస్తున్నారని, ఇది అసత్యమని వెల్లడించారు. ప్రకృతిని పరిరక్షించేందుకు పక్కా కార్యాచరణతో ముందుకు వెళతామని హామీ ఇచ్చారు. తాము చట్టబద్ధంగానే ముందుకు వెళ్తామని, తప్పడు ప్రచారంతో యూనివర్సిటీ విద్యార్థులు, బోధన, బోధనేతర సిబ్బంది, పర్యావరణ ప్రేమికులు ఆందోళనకు గురికావొద్దని విజ్ఞప్తి చేశారు.

# బీఆర్ఎస్ సభ కోసం ప్రజలు ఎదురుచూస్తున్నారు

## కాంగ్రెస్ పాలన వింతగా ఉంది

### మార్పు కోరుకున్న రైతుల కళ్లల్లో కన్నీళ్లే

### వరంగల్ నేతలతో కేసీఆర్ సంచలన కామెంట్స్



**హైదరాబాద్, మహా:** బీఆర్ఎస్ సిల్వర్‌జూబ్లీ సభ కోసం ప్రజలు ఆత్రుతతో ఎదురుచూస్తున్నారని ఆ పార్టీ అధినేత కేసీఆర్ అన్నారు. బీఆర్ఎస్ బహిరంగ సభకు ప్రజలు స్వచ్ఛందంగా తరలివస్తారని చెప్పారు. ఎర్రవెల్లి నివాసంలో ఉమ్మడి వరంగల్ జిల్లా బీఆర్ఎస్ నేతలతో మంగళవారం సమావేశమైన కేసీఆర్.. ఈ నెల 27న జరిగే బీఆర్ఎస్ రజోతోత్సవ సభ ఏర్పాట్లపై దిశానిర్దేశం చేశారు. బీఆర్ఎస్ సభకు సంబంధించి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. బుధవారం ఒంటి గంటకు ఎల్కతుర్తిలో బహిరంగ సభ స్థలానికి భూమిపూజ చేయనున్నట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా.. కాంగ్రెస్ ప్రభుత్వంపై కేసీఆర్ విమర్శలు గుప్పించారు. కాంగ్రెస్ పాలన వింతగా ఉందని కామెంట్స్ చేశారు. మార్పు కోరుకున్న రైతుల కళ్లల్లో కన్నీళ్లే మిగిలాయన్నారు. రైతులకు ఈ దుస్థితి వస్తుందని కలలో కూడా ఊహించలేదని చెప్పారు. ప్రభుత్వ చర్యలతో రైతులు, వివిధ వర్గాల ప్రజలు మనోధైర్యం కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ ప్రజానీకానికి మనోధైర్యం ఇచ్చేలా బీఆర్ఎస్ సిల్వర్‌జూబ్లీ సభ ఉండాలన్నారు కేసీఆర్. బీఆర్ఎస్ సభకు వచ్చే జనానికి అనుగుణంగా విస్తృత ఏర్పాట్లు చేయాలని పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. మరోవైపు.. వరంగల్ బహిరంగ సభ తర్వాత గ్రామ స్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు పార్టీ కమిటీలు వేసి.. ఆ తర్వాత శిక్షణ తరగతులు నిర్వహిస్తామని కేసీఆర్ ప్రకటించారు. ఇక.. సిల్వర్‌జూబ్లీ మహాసభ నిర్వహణ బాధ్యతలను అప్పగించినందుకు కేసీఆర్‌కు వరంగల్ జిల్లా బీఆర్ఎస్ నేతలు ధన్యవాదాలు చెప్పారు. కేసీఆర్ ఆదేశాల మేరకు వరంగల్ సభను విజయవంతం చేస్తామని హామీ ఇచ్చారు. తెలంగాణ ఉద్యమంలో అనేక సభలను నిర్వహించిన ఘనత వరంగల్‌కు ఉందని.. నాటి ఉద్యమ స్ఫూర్తితో మరోసారి పని చేస్తామని చెప్పారు. అభివృద్ధిలో హైదరాబాద్‌తో పోటీ పడేలా వరంగల్‌ను తీర్చిదిద్దిన ఘనత కేసీఆర్‌దేనని కొనియాడారు ఓరుగల్లు బీఆర్ఎస్ నేతలు. ఎమ్మెల్యే పల్లా రాజేశ్వరరెడ్డితో పాటు మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు సమావేశంలో పాల్గొన్నారు.




## కంచె గచ్చిబౌలి భూములపై తక్షణమే నివేదిక ఇవ్వండి

**కేంద్ర మంత్రి భూపేంద్ర యాదవ్ ఆదేశాలు**

**ఢిల్లీ, మహా:** హైదరాబాద్ కంచె గచ్చిబౌలి హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ (హెచ్‌సీయూ) భూములపై తక్షణమే నివేదికను పంపాలని కేంద్ర అటవీ, పర్యావరణ శాఖ మంత్రి భూపేంద్ర యాదవ్ సంబంధిత శాఖ ఉన్నతాధికారులను ఆదేశించారు. కొద్దిసేపటి క్రితం బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు జి.కిషన్ రెడ్డి ఆధ్వర్యంలో తెలంగాణ బీజేపీ ఎంపీలు బండి సంజయ్ కుమార్, డీకే అరుణ, ఈటల రాజేందర్, ధర్మపురి అరవింద్, కొండా విశ్వేశ్వర్ రెడ్డి, జి.నగేశ్, రఘునందన్ రావు తదితరులు కేంద్ర మంత్రి భూపేంద్ర యాదవ్ ను కలిసి ఈ మేరకు వినతి పత్రం సమర్పించారు.

## ఉప్పల్ స్టేడియంలో విజిలెన్స్ విచారణ

**వివాదాలన్నీ ముగిశాయని ప్రకటించిన హెచ్‌సీఏ-ఎస్ఆర్‌హెచ్**




**హైదరాబాద్, మహా:** టికెట్ల విషయంలో హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్‌కు హైదరాబాద్ సన్ రైజర్స్‌కు మధ్య వివాదం తలెత్తిన విషయం తెలిసిందే. ఆ వివాదం ముదిరి ముదిరి పాకాన పడింది. దీంతో ఈ వ్యవహారంపై విజిలెన్స్ విచారణకు రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించింది. ఎస్ఆర్‌హెచ్‌పై తీవ్ర ఒత్తిడికి గురి చేయడమే కాకుండా.. ఎక్కువ టికెట్లు కేటాయించాలంటూ హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ వేధింపులకు గురి చేస్తుందని ఎస్ఆర్‌హెచ్ ఆరోపిస్తూ.. ప్రభుత్వానికి ఈ మెయిల్ చేసింది. అయితే విచారణ సందర్భంగా హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్, సన్ రైజర్స్ హైదరాబాద్ యాజమాన్యం మధ్య నెలకొన్న వివాదం తాత్కాలికంగా సద్దుమణిగినట్లు తెలిసింది. ఉప్పల్ స్టేడియంలో ఎస్ఆర్‌హెచ్ టికెట్ల విషయంలో వేధింపులపై విజిలెన్స్ అధికారులు విచారణ జరిపారు. అయితే ఈ విచారణకు హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ప్రెసిడెంట్ జగన్మోహన్ రావు హాజరు కానట్టు తెలిసింది. వ్యక్తిగత పనుల నిమిత్తం హైదరాబాద్‌కు దూరంగా ఉన్నానని ఆయన విజిలెన్స్ అధికారులుకు సమాచారం అందించారట. ఈ నేపథ్యంలో బుధవారం విచారణకు హాజరవుతానని హెచ్‌సీఏ ప్రెసిడెంట్ స్పష్టం చేశారు. ఇక హెచ్‌సీఏ సెక్రటరీ బస్వరాజు నుంచి విజిలెన్స్ అధికారులు వివరాలు సేకరించారు. అనంతరం బస్వరాజు స్టేడియం నుంచి వెళ్లిపోయారు. అలాగే విజిలెన్స్ అధికారులు స్టేడియంలోనే విచారణ కొనసాగించారు. ఉప్పల్ స్టేడియంలో ఐపీఎల్ మ్యాచ్‌లను విజయవంతంగా నిర్వహించేందుకు ఎస్ఆర్‌హెచ్‌కు పూర్తిగా సహకరిస్తామని హెచ్‌సీఏ హామీ ఇచ్చింది. చర్చల అనంతరం వివాదాలన్నీ ముగిశాయని హెచ్‌సీఏఎస్ఆర్‌హెచ్ ప్రకటించాయి.

# మోదీ తర్వాత యోగీనే ప్రధాని

**ప్రధాని రిటైర్మెంట్ ప్రచారంపై స్పందించిన యోగి**

**రాజకీయం నా ఫుల్ టైమ్ కాదు.. నేను కేవలం యోగినే**



**మహా:** ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ త్వరలో రాజకీయాల నుంచి రిటైర్డ్ కాబోతున్నారంటూ గత కొద్ది రోజుల నుంచి ప్రచారం జరుగుతోంది. మోదీ చాలా ఏళ్ల తర్వాత ఆర్ఎస్ఎస్ హెడ్ క్వాటర్స్‌కు వెళ్లటంతో పుకార్లు మొదలయ్యాయి. మోదీ తర్వాత ఉత్తర ప్రదేశ్ ముఖ్యమంత్రి యోగీ ఆధిత్యనాథ్ ప్రధాని కాబోతున్నారన్న ప్రచారం కూడా జోరుగా నడుస్తోంది. ఈ పుకార్లపై యోగీ స్పందించారు. ఈ మేరకు మంగళవారం మీడియాతో మాట్లాడారు. మోదీ రిటైర్డ్‌మెంట్, తన రాజకీయ భవిష్యత్తు గురించి చెప్పుకొచ్చారు. ఆయన మాట్లాడుతూ.. ‘ చూడండి.. నేను ఓ రాష్ట్రానికి ముఖ్యమంత్రిని. ఉత్తర ప్రదేశ్‌లోని పేద ప్రజలకు సేవ చేయడానికి పార్టీ నన్ను ఇక్కడ పెట్టింది. రాజకీయాలు నా ఫుల్ టైం జాబ్ కాదు. ఇప్పుడు నేను ఇక్కడ నా పని మాత్రమే చేస్తున్నాను. నేను కేవలం యోగిని మాత్రమే. ప్రతీ దానికి ఓ నిర్థిష్ట సమయం అంటూ ఉంటుంది. నేను పార్టీ వల్లే ఇక్కడ ఉన్నాను. కేంద్ర నాయకులతో బేధాలు వస్తే.. ఇక్కడ ఉండగలుగుతానా?.. రెండో విషయం ఏంటంటే.. పార్టీకి సంబంధించిన పార్లమెంటరీ బోర్డు కమిటీ టికెట్లు ఎవరికి ఇవ్వాలో నిర్ణయిస్తుంది. అందులో కూడా చాలా రకాలుగా వడపోతలు ఉంటాయి. ఊసుపోక మాట్లాడేవారు మాట్లాడుతూనే ఉంటారు. ఆ నోళ్లను ఆపలేము కదా.. ’ అంటూ స్పష్టంగా తాను చెప్పాలనుకున్నది చెప్పేశారు. కాగా, యోగీ ఆధిత్యనాథ్ గత తొమ్మిదేళ్లుగా ఉత్తర ప్రదేశ్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ఎక్కువ సంవత్సరాలుగా ముఖ్యమంత్రిగా పని చేసిన వ్యక్తిగా రికార్డుకు సైతం ఎక్కారు. యోగీ ముఖ్యమంత్రిగా బాధ్యతలు తీసుకున్న తర్వాత లా అండ్ ఆర్డర్ మీద ఎక్కువ దృష్టి పెట్టారు. తప్పు చేసే వాళ్ల తాట తీస్తున్నారు. బుల్‌డోజర్లకు పని చెబుతున్నారు. అందుకే ఆయన్ని బుల్‌డోజర్ మంత్రి అని పిలుస్తున్నారు.

## రేపే మంత్రివర్గ విస్తరణ?

(మొదటిపేజీ తరువాయి)

స్పీకర్ గడ్డం ప్రసాద్ తో పాటు మల్ రెడ్డి రంగారెడ్డి, రామ్మోహన్ రెడ్డి, మనోహర్ రెడ్డిలు మల్లిఖార్జున ఖర్గే, కేసీ వేణుగోపాల్ ను కలిశారు. తమలో ఎవరో ఒకరికి ఛాన్స్ ఇవ్వాలని కోరుతున్నారు. ఇటీవల మాదిగ, బంజారా నాయకులు కూడా ముఖ్య నేతలను కలిశారు. మంత్రివర్గ విస్తరణపై అధికారిక ప్రకటన రాకున్నా నేతలు మాత్రం.. ఏప్రిల్ 3న ఉండొచ్చని నమ్ముతున్నారు. ఆ నలుగురికే ఛాన్స్ ఉందని, రాజగోపాల్ రెడ్డి పదవి మాత్రం తుది ప్రకటన వచ్చేదాకా చెప్పలేమని పార్టీవర్గాలు అంటున్నాయి. ఢిల్లీకి చేరిన నేతలు బీసీ ధర్నా అనంతరం మళ్ళీ అధిష్టానంతో భేటీ అయ్యే అవకాశాలున్నాయి.

### శాఖల్లో మార్పులు చేర్పులు

పలువురి శాఖల్లో మార్పులు చేర్పులు జరిగే అవకాశం ఉందని, నీటిపారుదల, పౌరసరఫరాల శాఖా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి నీటిపారుదల శాఖ స్థానంలో ఆర్థిక శాఖ ఇచ్చే అవకాశముందని, సీనియర్ల శాఖల్లో మార్పులు చేర్పులు జరగవచ్చని చెబుతున్నారు. శ్రీధర్ బాబుకు అదనపు శాఖలు వచ్చే అవకాశముందని, సుదర్శన్ రెడ్డికి హోం లేదా నీటిపారుదల శాఖ అప్పగించవచ్చన్న ప్రచారం జరుగుతోంది. మంత్రివర్గం రేసులో దాదాపు20 మంది ఆశావహులు ఉండగా, అధిష్టానం కొందరికి కీలక కార్పోరేషన్లు కట్టబెట్టాలన్న నిర్ణయానికొచ్చినట్లు తెలుస్తోంది. అయితే మంత్రివర్గ విస్తరణ ఏదైనా కారణాల వల్ల వాయిదాపడితే శ్రీరామనవమి, ఏఐసిసి సమావేశాల తర్వాత నిర్ణయం తీసుకునే అవకాశాలున్నాయి.

# పేదలకు పట్టాభిషేకం

## పేదరికం నిర్మూలన దిశగా నారా లోకేష్ అడుగులు

ఎన్నికల్లో ఇచ్చిన ప్రధాన హామీ అమలు చేస్తున్నాం

నెరవేరుతున్న మంగళగిరి పేదల దశాబ్దాల కల

మొదటి దశ లో మూడు వేల పట్టాల పంపిణీ కి రంగం సిద్ధం

మన ఇల్లు మన లోకేష్ పేరుతో ఏప్రిల్ మూడు నుండి పట్టాల పంపిణీ



**మహా :** లోకేష్ హామీ ఇస్తే నెరవేరినట్టే, మంగళగిరి పేద ప్రజల కల నెరవేరబోతోంది. ఎంతో మంది నాయకులు హామీ ఇచ్చారు కానీ సమస్య మాత్రం పరిష్కారం కాలేదు. సార్వత్రిక ఎన్నికల్లో ప్రచారం చేస్తూ తనను అత్యధిక మెజారిటీతో గెలిపిస్తే ప్రభుత్వ భూముల్లో నివసిస్తున్న వారికి శాశ్వత హక్కు కల్పిస్తూ పట్టాలు అందజేసి మంగళగిరి పేద ప్రజల దశాబ్దాల కల నెరవేరుస్తానని నారా లోకేష్ హామీ ఇచ్చారు. చరిత్రలో ఎప్పుడూ లేని విధంగా 91,413 ఓట్ల భారీ మెజారిటీ తో మంగళగిరి ప్రజలు లోకేష్ ను గెలిపించారు. గెలిచిన మొదటి రోజు నుండే ఇచ్చిన ప్రతి హామీ అమలు చేసే దశగా కార్యాచరణ మొదలుపెట్టారు. ఎన్నో ఏళ్లుగా అపరిష్కృతంగా మిగిలిపోయిన సమస్యల పరిష్కారం కోసం పట్టుదలతో పని చేస్తున్నారు. ఎన్నికల ముందు లోకేష్ ఇచ్చిన హామీల్లో ప్రధానమైంది ఇల్ల పట్టాల సమస్య. ఎన్నో ఏళ్లుగా పేద ప్రజలు ప్రభుత్వ భూముల్లో నివాసాలు ఏర్పాటు చేసుకొని నివసిస్తున్నారు. వారంతా తాము నివసిస్తున్న భూమిని, రెక్కల కష్టంతో నిర్మించుకున్న గూడుని క్రమబద్దీకరించాలని ఏళ్లుగా డిమాండ్ చేస్తూనే ఉన్నారు. ఎంతోమంది నాయకులు వారి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చి ఎన్నికల్లో లబ్ధి పొందినా ఆ హామీ అమలుకు కనీస కృషిచేసింది లేదు. కానీ ఇప్పుడు పరిస్థితి మారింది మంగళగిరి శాసనసభ్యుడిగా లోకేష్ పేదల పట్ల తనకు ఉన్న చిత్తశుద్ధిని కార్యాచరణలో పెట్టారు. గత పది నెలల్లో ప్రభుత్వ భూముల్లో నివసిస్తున్న ప్రజల వివరాల సేకరణ దగ్గర నుండి వివిధ శాఖల తో సమన్వయం, పేద ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా అధికారులే ఇళ్ళకు వెళ్లి దరఖాస్తులు నింపడం వరకూ అన్నీ దశలను లోకేష్ స్వయంగా పర్యవేక్షించారు. అత్యంత క్లిష్టమైన అటవీ భూములు, రైల్వే భూముల సమస్యను కూడా పట్టుదలగా తీసుకోని పరిష్కారం వైపు అడుగులు వేస్తున్నారు. మొదటి దశలో 3 వేల ఇల్ల పట్టాల పంపిణికి రంగం సిద్ధం చేసారు. ప్రభుత్వ భూముల్లో నివసిస్తున్న వారి భూమిని, వారు నిర్మించుకున్న ఇంటిని క్రమబద్ధీకరిస్తూ శాశ్వత హక్కు కల్పిస్తూ ఇంటి పట్టాలు అందజేయనున్నారు. పట్టాల పంపిణితో పేదలకు భరోసా లభించనుంది. ఏప్రిల్ 3 న మొదటి పట్టాను ఉండవల్లి గ్రామంలో అందజేయనున్నారు. లోకేష్ స్వయంగా లబ్ధిదారుల నివాసానికి వెళ్లి పట్టా అందజేసి మన ఇల్లు మన లోకేష్ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు. మొత్తంగా మూడువేలకు పైగా పట్టాల పంపిణి కి ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో కూటమి పార్టీల ముఖ్యనాయకులు, లోకేష్ భారీ విజయానికి కృషి చేసిన ఆయా గ్రామాల, వార్డుల ముఖ్య నాయకులు పాల్గొననున్నారు.

## తెలంగాణలో నాలుగు రోజుల పాటు వర్షాలు

- ఉష్ణోగ్రతలు తగ్గే అవకాశం
- ద్రోణి ప్రభావంతో వాతావరణంలో మార్పులు

**మహా :** రాగల నాలుగు రోజుల పాటు తెలంగాణలో పలుచోట్ల వడగళ్ల వానలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. ద్రోణి ప్రభావం కారణంగా వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం పేర్కొంది. వచ్చే నాలుగు రోజులు క్రమంగా రెండు నుంచి నాలుగు డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు తగ్గే అవకాశం ఉందని చెప్పింది. బుధవారం రాష్ట్రవ్యాప్తంగా తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే ఛాన్స్ ఉందని, వికారాబాద్, మహబూబ్‌నగర్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో వడగళ్లు కురుస్తాయని హెచ్చరించింది.

### అరెంజ్ అలెర్ట్ ...

నిజామాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, ఆదిలాబాద్, ఆసిఫాబాద్, నిర్మల్, నల్గొండ, సిద్దిపేట, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, నాగర్ కర్నూల్ జిల్లాల్లో ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వానలు కురుస్తాయని అంచనా వేసింది. ఆయా జిల్లాలకు ఎల్లో అలెర్ట్ జారీ చేసింది. గురువారం వికారాబాద్, సంగారెడ్డి, మహబూబ్‌నగర్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో వడగళ్లు పడే ఛాన్స్ ఉందంటూ ఆరెంజ్ అలెర్ట్ జారీ చేసింది. రంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, ఆదిలాబాద్, ఆసిఫాబాద్, నిర్మల్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగాం, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, నాగర్ కర్నూల్ జిల్లాల్లో అక్కడక్కడ ఉరుములు, మెరుపులు, గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో వానలు కురిసే అవకాశం ఉందని వాతావరణశాఖ వివరించింది.

# తెలంగాణ కేబినెట్ విస్తరణ ఏఐసీసీ పెద్దలకు జానారెడ్డి లేఖ

## హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాలకు ప్రాధాన్యం ఇవ్వాలని లేఖ



**మహా :** కేబినెట్ విస్తరణపై గతకొన్ని రోజులుగా చర్చ నడుస్తోంది. త్వరలోనే కేబినెట్ విస్తరణ ఉండబోతుందనే సంకేతాలు వినిపిస్తున్నాయి. ఏప్రిల్ 3న ముహూర్తం ఖరారు చేసినట్లు పొలిటికల్ సర్కిల్‌లో టాక్ వినిపిస్తోంది. ఇటీవల గవర్నర్ జిష్ణుదేవ్ వర్మతో సీఎం రేవంత రెడ్డి భేటీ కావడంతో మరింత ప్రాధాన్యత ఏర్పడింది. ప్రస్తుతం తెలంగాణ కేబినెట్‌లో ఆరు బెర్తులు ఖాళీగా ఉన్నాయి. సీఎం రేవంత్ రెడ్డితో సహా.. 12 మంది మంత్రులుగా కొనసాగుతున్నారు. అయితే ఖాళీగా ఉన్న ఆరు పోస్టుల్లో ప్రస్తుతం నాలుగు మంత్రి పదవులను భర్తీ చేయాలని కాంగ్రెస్ అదిష్ఠానం ఫిక్స్ అయినట్లు తెలిసింది. ఇటీవల సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ ఢిల్లీలో కాంగ్రెస్ పెద్దలు రాహుల్, మల్లిఖార్జున ఖర్గే, కేసీ వేణుగోపాల్‌తో సుదీర్ఘంగా చర్చించారు. పదువుల భర్తీపై కీలక నిర్ణయం తీసకున్నట్లు తెలిసింది. రేసులో పలువురు సీనియర్లు ఉన్నా.. అన్ని సామాజిక వర్గాలను దృష్టిలో ఉంచుకొని పదవులు భర్తీ చేయాలని చెప్పినట్లు తెలిసింది. మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, చెన్నూరు ఎమ్మెల్యే వివేక్, మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి, బోధన్ ఎమ్మెల్యే పి. సుదర్శన్ రెడ్డి పేర్లు ప్రముఖంగా వినిపిస్తున్నాయి.

ఈ నేపథ్యంలో కాంగ్రెస్ సీనియర్ నేత, జానారెడ్డి కేబినెట్ విస్తరణపై ఫోకస్ పెట్టారు. ఈ మేరకు ఏఐసీసీ పెద్దలు మల్లిఖార్జున ఖర్గే, కేసీ వేణుగోపాల్‌లకు లేఖ రాశారు. కేబినెట్ విస్తరణలో రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాల నుంచి ప్రాతినిథ్యం వహిస్తున్న ప్రజాప్రతినిధులకు ఛాన్స్ ఇవ్వాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ తరపున ఈ రెండు జిల్లాల నుంచి ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి మాత్రమే ఎమ్మెల్యేగా విజయం సాధించారు. ప్రస్తుతం ఆయన మంత్రి పదవి కోసం పోటీ పడుతున్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత పలువురు ఎమ్మెల్యే కాంగ్రెస్ గూటికి చేరారు. వారిలో ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ సైతం మంత్రి పదవి కోసం పోటీ పడుతున్నట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో జానా రెడ్డి లేఖ రాయటం చర్చనీయాంశంగా మారింది. జానారెడ్డి ఎవరికి మద్దతుగా లేఖ రాశారనేది ప్రస్తుతం హాట్ టాఫిక్‌గా మారింది.


# కరీంనగర్ అంబేద్కర్ స్టేడియానికి నిధులివ్వండి

## సింథటిక్ ట్రాక్ లను ఏర్పాటు చేయండి.. ఓపెన్ గ్యాలరీలకు రక్షణ ఏర్పాట్లు కల్పించండి

### కేంద్ర మంత్రి మన్ సుఖ్ మాండవీయకు బండి సంజయ్ విజ్ఞప్తి

### మాజీ మేయర్ సునీల్ రావు, శాతవాహన వర్శిటీ వీసీతో కలిసి కేంద్ర మంత్రిని కలిసిన సంజయ్

**మహా :** ఖేలో ఇండియా పథకంలో భాగంగా కరీంనగర్ జిల్లాలోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ స్టేడియంలో క్రీడా సదుపాయాల అభివృద్ధికి ప్రత్యేకంగా నిధులను మంజూరు చేయాలని కోరుతూ కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కేంద్ర కార్మిక, ఉపాధి, క్రీడా వ్యవహారాల శాఖ మంత్రి మన్సూక్ మాండవీయను కోరారు. ఈరోజు ఉదయం ఇదే అంశంపై ఢిల్లీకి విచ్చేసిన కరీంనగర్ మాజీ మేయర్ యాదగిరి సునీల్ రావు, శాతవాహన యూనివర్శిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ఉమేశ్ కుమార్ లతో కలిసి బండి సంజయ్ కేంద్ర మంత్రి మాండవీయను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంజయ్ మాట్లాడుతూ "తెలంగాణలోని అత్యంత పెద్ద నగరాలలో ఒకటైన కరీంనగర్ విద్య, క్రీడల్లో ప్రత్యేక గుర్తింపు పొందింది. అందులో భాగంగా కరీంనగర్ శాతవాహన విశ్వవిద్యాలయంలో ఇంజినీరింగ్, వైద్య కళాశాలల తోపాటు ఇతర విద్యాసంస్థలున్నాయి. ముఖ్యంగా



క్రీడల్లో కరీంనగర్ ప్రత్యేక ప్రాధాన్యతను సంతరించుకుంది. అర్జున అవార్డు గ్రహీత మడాసు శ్రీనివాసరావు కరీంనగర్‌కు చెందినవారే. దీనిని దృష్టిలో ఉంచుకుని ఖేలో ఇండియా లేదా కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఇతర పథకాల ద్వారా కరీంనగర్ లోని అంబేద్కర్ స్టేడియం అభివృద్ధికి తగిన నిధులు మంజూరు చేయాలి."అని కోరారు. ఈ సందర్భంగా సునీల్ రావుతో కలిసి అంబేద్కర్ స్టేడియంలోని క్రీడా సదుపాయాలను వివరించారు. "1986లో 22.20 ఎకరాల భూమి బహుళ ప్రయోజన ఈ క్రీడా స్టేడియం కోసం కేటాయించారు. 19982000 మధ్య ఎంపీ లాడ్స్, సింగరేణి కాలరీస్, ఎన్టీపీసీ, ఇతర ప్రైవేట్ సంస్థల సహకారంతో లెవెలింగ్, గ్యాలరీలు, 8లేన్ 400 మీటర్ల అథ్లెటిక్స్ ట్రాక్ వంటి అభివృద్ధి పనులు చేపట్టడం జరిగింది. అయితే రోజురోజుకూ అథ్లెట్ల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో ప్రస్తుత మట్టి ట్రాక్ కారణంగా అనేక మంది గాయాల బారిన పడుతున్నారు" అని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిని దృష్టిలో ఉంచుకుని అంబేద్కర్ స్టేడియం అభివృద్ధిలో భాగంగా " 8లేన్ సింథటిక్ అథ్లెటిక్స్ ట్రాక్ వల్ల మట్టి ట్రాక్ స్థానంలో సింథటిక్ ట్రాక్ ఏర్పాటు చేయండి. అట్లాగే అథ్లెట్లు రాత్రి వేళల్లో కూడా సాధన చేసేందుకు ఫ్లడ్ లైట్లను ఏర్పాటు చేయాలి. దీంతోపాటు పోటీలు జరుగుతున్నప్పుడు ప్రస్తుత ఓపెన్ గ్యాలరీ(10)ల్లో క్రీడాకారులు, ప్రేక్షకులకు రక్షణ లేకుండా ఇబ్బంది కలిగిస్తున్నందున గ్యాలరీలపై తగిన (కెనోపీ) ఏర్పాట్లు చేసేలా చర్యలు తీసుకోవాలి."అని కోరారు. తద్వారా కరీంనగర్ అథ్లెట్లు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పోటీ చేసి దేశానికి గౌరవం తీసుకురావడానికి అనేక అవకాశాలున్నాయని పేర్కొన్నారు.

# ఏంటీ అరాచకం...?

## సుప్రీంకోర్టే షాకైన వేళ.. యూపీ ప్రభుత్వ తీరుపై గుర్రు



**మహా :** దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు మంగళవారం ఓ కీలక అంశంలో షాకైంది. ఉత్తరప్రదేశ్ లోని ప్రయాగ్ రాజ్ లో తాము గతంలో ఇచ్చిన ఆదేశాలను ధిక్కరించి అధికారులు వ్యవహరించిన తీరుపై సుప్రీంకోర్టులో జస్టిస్ అభయ్ ఓకా, జస్టిస్ ఉజ్జల్ భూయాన్ తో కూడిన ద్విసభ్య ధర్మాసనం దిగ్భ్రాంతి వ్యక్తం చేసింది. ఈ వ్యవహారంపై తీవ్రంగా స్పందించిన సుప్రీంకోర్టు ఉత్తరప్రదేశ్ ప్రభుత్వానికి కీలక ఆదేశాలు జారీ చేసింది. ప్రయాగ్ రాజ్ లో ఓ లాయర్, ఓ ప్రొఫెసర్ తో పాటు మరో ముగ్గురి ఇళ్లను ప్రభుత్వం నోటీసులిచ్చి తగిన గడువు ఇవ్వకుండానే కూల్చివేసింది. దీంతో వారు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ వ్యవహారంపై అత్యున్నత న్యాయస్థానం తీవ్రంగా స్పందించింది. ఈ ఘటన తమను షాక్ కు గురి చేసినట్లు సుప్రీంకోర్టు ధర్మాసనం పేర్కొంది. ఈ కూల్చివేత రాజ్యాంగ విరుద్ధం, అమానవీయం అని పేర్కొంది. ఇది తమ మనస్సాక్షిని దిగ్భ్రాంతికి గురిచేస్తోందని తెలిపింది. ఆశ్రయం పొందే హక్కు, చట్టబద్ధమైన ప్రక్రియను ఇది స్పష్టంగా ఉల్లంఘించినట్లు కనిపిస్తోందని జస్టిస్ ఎఎస్ ఓకా, జస్టిస్ ఉజ్జల్ భుయాన్‌లతో కూడిన ధర్మాసనం వ్యాఖ్యానించింది. ఈ వ్యవహారంలో కోర్టును ఆశ్రయించిన ఇంటి యజమానులకు రూ.10 లక్షల చొప్పున పరిహారం చెల్లించాలని యూపీ ప్రభుత్వాన్ని ఆదేశించింది. 2023లో హత్యకు గురైన గ్యాంగ్‌స్టర్ అతిక్ అహ్మద్‌కు చెందిన భూమిగా భావించి అధికారులు తమ క్లయింట్ల నివాసాలను కూల్చేశారని పిటిషనర్ల లాయర్లు కోర్టుకు తెలిపారు. దీంతో కూల్చివేత నోటీసులు ఇచ్చిన తీరుపై కూడా అధికారులను కోర్టు మందలించింది. ఆస్తులపై నోటీసులు అతికించామని రాష్ట్ర న్యాయవాది చెప్పగా, రిజిస్టర్డ్ పోస్ట్ ద్వారా నోటీసులు ఎందుకు పంపాలేదని కోర్టు ప్రశ్నించింది.

# నా మద్దతు విద్యార్థులకే..

## హెచ్‌సీయూ భూముల వివాదంపై సినీ నటుడు ప్రకాష్ రాజ్ విధ్వంసాన్ని అంగీకరించమని ఎక్స్ లో పోస్ట్




**మహా :** హెచ్ సీయూ భూముల వివాదం అగ్గి రాజేస్తున్న నేపథ్యంలో రాజకీయ ప్రముఖులు, సినిమా ప్రముఖులు స్పందిస్తూ వారి వారి అభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలో ప్రముఖ నటుడు, రాజకీయ విశ్లేషకుడు ప్రకాష్‌రాజ్ కూడా ఈ వివాదంపై తనదైన శైలిలో స్పందించారు. విద్యాసంస్థలకు కేటాయించిన భూములను వాణిజ్య అవసరాలకు ఉపయోగించడం అన్యాయమని ప్రకాష్ రాజ్ అభిప్రాయపడ్డారు. ఈ మేరకు ఎక్స్ (ట్విట్టర్)లో పోస్ట్ చేశారు. హెచ్సీయూ పరిధిలో ఉన్న 400 ఎకరాల భూములను ఇతర ప్రయోజనాల కోసం వినియోగించాలన్న రేవంత్ రెడ్డి సర్కార్ నిర్ణయంపై సర్వత్రా వ్యతిరేకత వ్యక్తమవుతోంది. విద్యార్థులు, మేధావులు, పౌర సమాజం, రాజకీయ పార్టీలు దీనిపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. ప్రభుత్వం ఈ భూములను వాణిజ్య అవసరాలకు ఉపయోగించాలనే ఆలోచనలో ఉందని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఈ సందర్భంగా స్పందించిన ప్రకాష్ రాజ్ తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. "ఈ విధ్వంసం ఎంత మాత్రం ఆమోదయోగ్యం కాదు, ఇది మంచిది కాదు.. ఇలాంటి దారుణమైన చర్యకు వ్యతిరేకంగా నేను విద్యార్థులు, పౌరులకు మద్దతు ఇస్తున్నాను. మన భవిష్యత్తు కోసం ఈ నిరసనను షేర్ చేసి విస్తృతం చేయాలని ప్రతి ఒక్కరినీ అభ్యర్థిస్తున్నాను." అంటూ ట్విట్టర్ వేదికగా ప్రకాష్ రాజ్ తెలిపారు. "విద్యాసంస్థల భూములు ప్రజల భవిష్యత్తును తీర్చిదిద్దే సాధనాలు. వాటిని వ్యాపార అవసరాల కోసం తాకట్టు పెట్టడం అత్యంత దౌర్భాగ్యమైన పరిణామం. ఇది తక్షణమే ఆగాలి. విద్యార్థుల హక్కులను హరిస్తే, భవిష్యత్ తరం ప్రశ్నించకుండా ఉండదు. ఇలాంటి నిర్ణయాలు విద్యా వ్యవస్థ మీద నమ్మకాన్ని దెబ్బతీస్తాయి," అంటూ మరో పోస్ట్‌లో ప్రకాష్‌రాజ్ పేర్కొన్నారు.

# హెచ్ సియు భూమిలో మైహోం విహంగ

## 25 ఎకరాలు అప్పనంగా కట్టబెట్టారు

### లోపాయికారీ ఒప్పందంతో బీఆర్ఎస్ సహకారం

### ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ ఆరోపణ.. మైహోం విహంగ ముందు ధర్నా




**హైదరాబాద్, మహా:** హైదరాబాద్ మై హోం విహంగ వద్ద ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్, విద్యార్థి నాయకులు ఆందోళన చేపట్టారు. బీఆర్ఎస్, బీజేపీ పార్టీలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వెంకట్ మాట్లాడుతూ.. హెచ్ సియు పై ఈ రెండు పార్టీలు లేని ప్రేమ ఉన్నట్లు నటిస్తున్నాయని ఆరోపించారు. కంచె గచ్చిబౌలి లోని సర్వే 25లో 2004 లో 534 ఎకరాలు ప్రభుత్వానికి ఇస్తున్నట్టు హెచ్ సియు రిజిస్ట్రార్ సంతకం చేశారన్నారు. ఇందుకు బదులుగా ప్రభుత్వం 397 ఎకరాలు ఇస్తున్నట్లు సంతకం చేశారన్నారు. 534 లో 400 ఐఎంజి భారత్ కు, 120 ఎకరాలు ఉద్యోగ సంఘాలకు కేటాయించారన్నారు. ఐఎంజి భారత్ ఒప్పందం ప్రకారం వ్యవహరించలేదన్నారు. ఆ భూములు ప్రైవేట్ వ్యక్తుల చేతుల్లోకి వెళ్ళకుండా ప్రభుత్వం న్యాయ పోరాటం చేసిందన్నారు.

### కొట్లాడి సాధించాం..

400 ఎకరాలు ప్రభుత్వ భూమిగా కోర్టుల్లో కోట్లాడి సాధించామన్నారు. ఈ భూములు ప్రైవేట్ వ్యక్తులకు చెందాలని కొందరు భావించారన్నారు. ఈ 25 సర్వే నంబర్ లోనే బీఆర్ఎస్ అధికారంలో ఉన్న సమయంలో మై హోం విహంగ కు 25 ఎకరాలు కట్టబెట్టారని ఆరోపించారు. ఇక్కడ పెద్ద భవనాలు నిర్మించారన్నారు. రెండు భవనాలకే వంద ఫీట్ల రోడ్డు వేశారని ధ్వజమెత్తారు. ఉద్యోగ సంఘాలకు కేటాయించిన భూమిలో మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ తప్పుడు పేర్లతో 20 ఎకరాలు ఆక్రమించే ప్రయత్న చేశాడని ఆరోపించారు. ఆ 20 ఎకరాలు ప్రభుత్వం గుంజుకుంటుందన్న భయంతో శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతున్నాడని ధ్వజమెత్తారు. ప్రభుత్వ భూమిలో నిర్మించిన మై హోం నిర్మాణాల వద్దకు ఫాక్ట్ ఫైండింగ్ కమిటీ ఎందుకు రావడం లేదని ప్రశ్నించారు. పర్యావరణం దెబ్బతింటుందని.. మై హోం విహంగకు 25 ఎకరాలు ఇచ్చినప్పుడు కేటీఆర్ కు కనిపించలేదా? అని ప్రశ్నించారు. లోపాయికారీ ఒప్పందాలు లేకపోతే మై హోం నిర్మాణం చేస్తున్నప్పుడు ఎందుకు స్పందించలేదన్నారు. వ్యక్తిగత స్వార్థం కోసమే ప్రభుత్వ భూమిని మై హోం కు కట్టబెట్టారన్నారు.

# జర్మనీ యువతిపై కారు డ్రైవర్ అత్యాచారం

## లిఫ్ట్ పేరుతో కారులో ఎక్కించుకున్న దుండగుడు నిందితుడి పట్టుకున్న పోలీసులు



**మహా :** నాగర్ కర్నూల్ జిల్లాలోని ఓ మహిళపై జరిగిన సామూహిక అత్యాచార ఘటన మరువక ముందే హైదరాబాద్‌లో మరో దారుణమైన ఘటన చోటు చేసుకుంది. సోమవారం రాత్రి పహాడీషరీఫ్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ జర్మనీ యువతి (25)పై కారు డ్రైవర్ అత్యాచారానికి పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, జర్మనీకి చెందిన ఓ యువతి జర్మనీలో తనతో పాటు చదువుకున్న హైదరాబాద్‌కు చెందిన తన స్నేహితుడిని కలిసేందుకు వారం రోజుల క్రితం నగరానికి వచ్చింది. సోమవారం స్నేహితులతో కలిసి హైదరాబాద్‌లోని పలు ప్రాంతాలను సందర్శించారు. సోమవారం రాత్రి సమయంలో తన స్నేహితులను డ్రాప్ చేసి ఎయిర్‌పోర్టుకు వెళ్తుండగా కారు డ్రైవర్ ఆమెను తన కారులో ఎక్కించుకున్నాడు. అదును చూసి మామిడిపల్లి వద్ద ఆ డ్రైవర్ యువతిపై అఘాయిత్యానికి పాల్పడ్డాడు. అనంతరం మీర్‌పేట పోలీస్ స్టేషన్‌లో యువతి ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. అనంతరం ఆమెను వైద్య పరీక్షల నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. ప్రత్యేక బృందాలతో గాలించి నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. మీర్‌పేట పోలీసులు ఈ కేసును పహాడీ షరీఫ్ పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేశారు. ఈ కేసులో మరిన్ని వివరాలు తెలియాల్సి ఉంది.

# లెక్కలు తీస్తే బొక్కలు విరుగుతాయ్

## మైహోం భవనాలు ఆ భూముల్లోకి ఎలా వచ్చాయ్?

### బీఆర్ఎస్ కు పీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ వార్నింగ్



**హైదరాబాద్, మహా :** అన్ని యూనివర్సిటీల భూములపై సర్వే వేయించి కాపాడాలని ముఖ్యమంత్రికి రిక్వెస్ట్ చేస్తానని, లెక్కలు తీస్తే బొక్కలు విరుగుతాయని పిసిసి చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. మంగళవారం గాంధీభవన్ లో మీడియా సమావేశంలో మాట్లాడారు. హెచ్ సి యు కోసం ఇందిరా గాంధీ 2500 ఎకరాలు ఇచ్చిందని, కేటీఆర్, కిషన్ రెడ్డి చేతిలో చెయ్యేసి చెప్పు బావ అనే లాగా వ్యవహరిస్తున్నారన్నారు. రామేశ్వర రావు కన్ను హెచ్ సి యుభూములపై పడిందని, కోర్టులో ఉన్న కారణంగా భూములను కొల్లగొట్టలేకపోయారన్నారు. అన్యాక్రాంత భూముల్లోమై హోం విహంగ భవనం వెలిసిందని, హెచ్ సీయు భూముల్లో మై హోం భవనాలు కట్టారని, అప్పుడు బీజేపీ ఎందుకు మాట్లాడలేదన్నారు. గత ప్రభుత్వంలో అక్కడ రోడ్లు వేశారని, కేసీఆర్ బినామీలకు భూములు ఇచ్చేపుడు వన్య ప్రాణులు కనపడలేదు? 534 ఎకరాలు ప్రభుత్వం తీసుకున్నందుకు గోపనపల్లిలో 397 ఎకరాల భూమిని యూనివర్సిటీకి కేటాయించారన్నారు. విద్యార్థులను రెచ్చగొట్టి కేటీఆర్ రాజకీయ లబ్ది పొందే ప్రయత్నం చేస్తున్నారన్నారు.

# త్వరలోనే భారత్ కు వస్తా: సునీత విలియమ్స్

## అంతరిక్షం నుంచి ఇండియా అద్భుతంగా కనిపించింది: సునీతా విలియమ్స్



**మహా :** దాదాపు తొమ్మిది నెలల పాటు అంతరిక్షంలో చిక్కుకుపోయిన భారత సంతతి వ్యోమగామి సునీతా విలియమ్స్, మరో వ్యోమగామి బుచ్ విల్మోర్ ఇటీవలే భూమి మీద సురక్షితంగా అడుగుపెట్టారు. తాజాగా నాసా నిర్వహించిన ప్రెస్ కాన్ఫరెన్స్ లో అంతరిక్షంలో అనుభవాలను పంచుకున్నారు. అంతరిక్షం నుంచి భారత్ ఎలా కనిపించిందనే ప్రశ్నకు సమాధానంగా చాలా అద్భుతంగా కనిపించిందని సునీత చెప్పారు. తాము హిమాలయాల మీద నుంచి వెళ్లిన ప్రతి సారి. మంచు పర్వతాల అందాలను విల్మోర్ కెమెరాలో బంధించారని సునీత తెలిపారు. హిమాలయాలు అత్యద్భుతం అని చెప్పారు. గుజరాత్, ముంబై వంటి ప్రాంతాల మీద నుంచి వెళుతున్నప్పుడు తీరం వెంబడి ఉండే మత్స్యకారుల పడవలు తమకు సిగ్నల్ మాదిరి పని చేసేవని అన్నారు. భారత్ కు వచ్చే అంశం గురించి సునీత మాట్లాడుతూ, తన తండ్రి పుట్టిన దేశానికి త్వరలోనే వెళ్లాలనుకుంటున్నానని చెప్పారు. ఇండియాలో ఉన్న బంధువులు, ప్రజలతో ముచ్చటించాలని వారితో తన అనుభవాలను పంచుకోవాలని ఉందని అన్నారు. భారత్ ఒక గొప్ప ప్రజాస్వామ్య దేశమని కొనియాడారు. అంతరిక్ష రంగంలో విజయాలు సాధిస్తున్న దేశాల సరసన నిలుస్తున్న దేశమని కితాబునిచ్చారు. తనలో భారత్ మూలాలు ఉండటం తనకు ఎంతో గర్వంగా ఉందని చెప్పారు.

# శాతవాహన వర్శిటీకి లా కాలేజీని మంజూరు చేయండి

## కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్ మేఘవాల్ కు బండి సంజయ్ వినతి

### వర్శిటీ వీసీ, మాజీ మేయర్ లతో కలిసి అరగంటకుపైగా న్యాయశాఖ మంత్రితో భేటీ

### సానుకూలంగా స్పందించిన కేంద్ర మంత్రి

**మహా :** కరీంనగర్ లోని శాతవాహన విశ్వవిద్యాలయం పరిధిలో లా కాలేజీకి అనుమతి ఇవ్వాలని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ మంగళవారం కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్ మేఘ్వాల్ ను కోరారు. శాతవాహన వర్శిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ఉమేశ్ కుమార్, కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ మాజీ మేయర్ యాదగిరి సునీల్ రావులతో కలిసి బండి సంజయ్ ఢిల్లీలో కేంద్ర మంత్రి అర్జున్ మేఘ్వాల్ ను కలిసి ఈ మేరకు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా పార్లమెంట్ లో అరగంటకుపైగా కేంద్ర మంత్రితో భేటీ అయ్యారు. శాతవాహన వర్శిటీ పరిధిలో వచ్చే విద్యా సంవత్సరానికిగాను 120 మందితో (రెండు సెక్షన్లతో కలిపి) లా కాలేజీని నడిపేందుకు అనుమతి ఇవ్వాలని కోరుతూ ప్రభుత్వానికి గతంలో విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో వర్చువల్ ద్వారా తనిఖీ నిర్వహించిన బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా వివరణలతో కూడిన నివేదిక కోరిందని పేర్కొన్నారు. బార్ కౌన్సిల్ ఆదేశాల మేరకు వివరణాత్మక నివేదికను



పంపామని తెలిపారు. దీనిని దృష్టిలో ఉంచుకుని మూడేళ్ల లా కోర్సుకు అనుమతి ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. బండి సంజయ్ వినతికి సానుకూలంగా స్పందించిన అర్జున్ మేఘ్వాల్ అందుకు అనుగుణంగా శాతవాహన వర్శిటీకి అనుబంధంగా సాధ్యమైనంత తొందర్లో లా కాలేజీకి అనుమతి ఇస్తామని హామీ ఇచ్చారు. అట్లాగే రాబోయే విద్యా సంవత్సరం(202526) నుండే లా కాలేజీ ప్రారంభానికి చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను కేంద్ర మంత్రి ఆదేశించారు.

# దేశంలో 2026 నాటికి నక్సలిజం పూర్తిగా అంతం

## కేంద్ర హోం మంత్రి అమిత్ షా



**మహా :** వచ్చే ఏడాది 2026 నాటికి దేశంలో నక్సలిజాన్ని పూర్తిగా నిర్మూలిస్తామని కేంద్ర హోం మంత్రి అమిత్ షా వెల్లడించారు. దేశంలో నక్సల్స్ ప్రభావిత జిల్లాలు 12 ఉన్నాయని, అధికారిక రికార్డుల ప్రకారం 2015లో ఇవి 35 ఉండగా, 2018 నాటికి 30కి తగ్గాయని వివరించారు. 2021నాటికి 25కు వచ్చాయని, తాజాగా వాటి సంఖ్య 6కు చేరిందన్నారు. నక్సల్ రహిత భారత్ ను నిర్మించే దిశగా మరోమైలు రాయిని చేరుకున్నామని అమిత్ షా అన్నారు.

అదిరేటి డ్రెస్సు మేమేస్తే.. బెదిరేటి లుక్కు మీరిస్తే దడ.. మీకు దడ.. సరదాగ మీము నడిచొస్తే మీకు దడ.. కన్నె చూపుల్లో ఉన్నదిలే అన్న పాట వింటుంటే ర్యాంప్ పై అందాల సుందరి హొయలు గుర్తొస్తాయి. ఇక.. భారీ ర్యాంప్ లపై 140 దేశాల అందెగత్తెల వయ్యారాలు ఒలకబోస్తుంటే చూడడానికి రెండు కళ్ళు చాలవంటున్నారు అభిమానులు.. ఈ అందాల విందుకు విశ్వగనగరి భాగ్యనగరం వేదిక కానుండడం తెలుగువారిని, భారతీయులను సంతోషపరుస్తోంది. ఆ ఆక్షణం ఎపుడెపుడా అని ఎదురుచూసేలా చేస్తోంది. గ్రాండ్ ఫినాలేతో సహా ప్రారంభ మరియు ముగింపు వేడుకలు హైదరాబాద్‌లో జరగనున్నాయి.

- మహా ప్రత్యేకం



## 24 రోజుల పండుగ

మే 31న హైటెక్స్ లో జరిగే గ్రాండ్ ఫినాలేకు ముందు జరిగే పలు కార్యక్రమాల్లో పాల్గొనేందుకు ప్రపంచం నలు మూలల నుంచి పోటీదారులు మే 6, 7 తేదీల్లో నగరానికి చేరుకుంటారు. మే నెల 10న గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో తెలంగాణ జానపద, గిరిజన నృత్యాలతో తెలంగాణ ఆటపా బలతో ఘనంగా ప్రారంభో త్సవం జరగనుంది. ఈ పోటీల్లో భాగంగా బుద్ధవనం, చౌమహల్లా ప్యాలెస్, రామప్ప ఆలయం, యాదగిరి గుట్ట ఆలయం. పోచంపల్లి తదితర పర్యాటక ప్రాంతాలను సందర్శిస్తారు.

MISS WORLD HYDERABAD

# దునియా చూపు.. తెలంగాణ వైపు

### అదిరేటి డ్రెస్సు మేమేస్తే.. అంటూ అతిలోకసుందరిల రాక

తెలంగాణ జరూర్ ఆనా.. మిస్ వరల్డ్ బ్యూటీకో దేఖోనా

140 దేశాల నుంచి సుందరీమణులు

మే 7 నుంచి 31 వరకు జరగనున్న పోటీలు

తెలంగాణ ఆతిథ్యం.. ప్రపంచానికి ఇక్కడి ఆనంద దృశ్యం



## 21 ప్రదేశాల్లో 23 థీమ్‌లతో ఈవెంట్లు

అందం, ప్రతిభను చాటడమే కాకుండా తెలంగాణ సాంస్కృతిక వైభవం, సంస్థ రాయలతో పాటు పర్యాటక ప్రాంతాల అందచందాలను ప్రపంచానికి పరిచయం చేసే అవకాశం రాష్ట్రానికి దక్కుతోంది. తెలంగాణ... జరూర్ అనా' తెలంగాణకు తప్పక రండి) అనే వివాదంతో ఈ కార్యక్రమాన్ని ప్రభుత్వం నిర్వహించనుంది. మే 10వ తేదీన హైదరాబాద్ లోని గచ్చిబౌలి స్టేడియంలో ప్రారంభమైన ఈ వేడుక మే 31వ తేదీన హైటెక్స్ లో గ్రాండ్ ఫినాలేతో ముగుస్తుంది. మొత్తం 21 ప్రదేశాల్లో 23 థీమ్ లతో ఈవెంట్లు నిర్వహించేలా ప్రణాళికలు రూపొందిం చినట్లు టూరిజం మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. విస్తృతమైన అంత ర్జాతీయ మీడియా కవరేజీ, లక్షలాది మంది ప్రపంచ వీక్షకులతో ఈ ఫెస్టివల్ హైలెట్ కాబోతుందని వివరించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా ఈ ఈవెంట్ గురించి ఘనంగా చెప్పారు.

### ఇలా కార్యక్రమాలు..

మెడికల్ అవేర్ నెస్ కార్యక్ర మంలో భాగంగా హైదరాబాద్ లోని ప్రధాన అసుతులను అందగత్తెలు సందర్శిస్తారు. మే 17న గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో మిస్ వరల్డ్ ఫినాలే జరగనుంది. కాంటినెంటల్ గ్రూపుల్లో కంటెస్టెంట్లను ఆడ్జ్ చేసే కాంటినెంటల్ ఫినాలేమే 20, 21 తేదీలో టీహబ్ లో జరగుతుంది. మే 220 శిల్పకావేదికలో మిస్ వరల్డ్ టాలెంట్ ఫినాలే, 23న ఐఎస్ బీలో హెడ్ టు హెడ్ ఛాలెంజ్ ఫైసల్ జరుగు తాయి. మే 24న హైటెక్స్ లో మిస్ వరల్డ్ టాప్ మోడల్, ఫ్యాషన్ ఫినాలే. 25న జువెలరీ ఇండ్ పెల్లి. షో నిర్వహించను న్నారు. ఫైనల్ గా మే 31న హైటెక్స్ లో మిస్ వరల్డ్ 2025 గ్రాండ్ ఫినాలే లో విజేతకు కిరీటం దక్కుతుంది.

## భారతీయ విశ్వ సుందరీమణులు

- మిస్ వరల్డ్ పోటీల చరిత్రలో ఇప్పటికి ఆరుగురు భారతీయ ముద్దుగుమ్మలు ప్రపంచ సుందరీమణు లుగా వెలిగారు.
- గోవా అందగత్తె రీటా పారియా చరిత్ర సృష్టించింది. 1966లో ర్యాంప్ పై తొలి ఆసియా వైద్యురాలిగా రికార్డుతో మిస్ వరల్డ్ కిరీటాన్ని అందుకుంది.
- 1994లో ఐశ్వర్యారాయ్ విశ్వసుందరిగా నిలిచింది.
- 1997లో భారతీయ మోడల్ డయానా హెడేన్ మిస్ వరల్డ్ రికార్డును సొంతం చేసుకుంది.
- 1999లో భారతీయ మోడల్ యుక్తాముఖీ మిస్ వరల్డ్ రేస్ లో విజేతగా నిలిచింది.
- 2000లో అందాల ముద్దుగుమ్మ ప్రియాంక చోప్రాతో భారతీయ సుందరీమణుల చరిత్రను సృష్టించింది.
- 2017లో భారతీయ మోడల్ మానుషీ చిల్లర్ మిస్ వరల్డ్ పోటీ విజేతగా నిలిచింది.

## మిస్ వరల్డ్ పోటీల వెనుక స్మితా సబర్వాల్



మిస్ వరల్డ్ పోటీల కోసం దేశంలోని అనేక నగరాలు పోటీపడితే.. ఈసారి హైదరాబాద్‌కు ఈవెంట్ రావడం వెనుక మాత్రం తెలంగాణ టూరిజం సెక్రటరీ స్మితా సబర్వాల్ ఉన్నారని చెప్పాలి. ఆమె కృషి వల్లే నగరంలో మిస్ వరల్డ్ పోటీలకు నగరం వేదిక కాబోతోంది. దాంతో స్మితా సబర్వాల్‌పై ప్రశంసల వర్షం కురుస్తోంది. తెలంగాణ ప్రభుత్వంలో స్మితా సబర్వాల్ టూరిజం శాఖ బాధ్యతలు చూస్తున్నారు. ఈ ఏడాది మిస్ వరల్డ్ పోటీల నిర్వహణ కోసం ఏర్పాట్లు జరుగుతున్నాయని తెలియగానే అలర్ట్ అయ్యారు. ఈసారి హైదరాబాద్ నగరంలో మిస్ వరల్డ్ పోటీల కోసం ప్రభుత్వం తరపున సౌకర్యాలు కల్పిస్తామని ఒప్పించారు. మరోవైపు మిస్ వరల్డ్ పోటీలు నిర్వహించేందుకు ముంబై గట్టిగానే ప్రయత్నించింది. కానీ స్మితా సబర్వాల్ మాత్రం గట్టిగా ప్రయత్నించి హైదరాబాద్ కు అవకాశం వచ్చేలా చేశారు.

**గర్వంగా ఉంది- స్మితా సభర్వాల్**

“తెలంగాణ 72వ మిస్ వరల్డ్ 2025ని నిర్వహిస్తున్నట్లు ప్రకటించడానికి గర్వంగా ఉంది, అందం అనేది కేవలం కంటికి కనిపించేది కాదు; దాని భూమి, ప్రజలు, సంస్కృతి మరియు సంప్రదాయాలతో ప్రతిధ్వనించే భూమిని చూడటానికి ప్రపంచాన్ని స్వాగతిస్తోంది. తెలంగాణ అనేది ప్రతి పండుగ ఆనంద దృశ్యం, ఇక్కడ చేతిపనుల ప్రతి చేతి నైపుణ్యం మరియు భక్తి కథను చెబుతుంది ఇది తెలంగాణ, నిజమైన అందం దేనిని సూచిస్తుందో దానికి ప్రతిబింబం.""ఈ వేదిక తెలంగాణ యొక్క గొప్ప చేనేత వారసత్వం, అద్భుతమైన గమ్యస్థానాలు, రుచికరమైన వంటకాలు, కళారూపాలు మరియు చేతిపనులను ప్రదర్శిస్తుంది" అని టూరిజం యువజన సర్వీసుల శాఖ కార్యదర్శి స్మితా సభర్వాల్ అన్నారు.

# భూ భారతి చట్టంతోనే భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం...

- ఖమ్మంలో విలేకరుల సమావేశంలో తెలంగాణ ఉద్యోగ జేఏసీ చైర్మన్ వి.లచ్చిరెడ్డి
- ప్రజా ప్రభుత్వంలో భూ సమస్యలు లేని గ్రామాలే మా లక్ష్యం
- గ్రామీణ రెవెన్యూ వ్యవస్థ బలోపేతం కోసమే 10,954 మంది జీపీఓల నియామకం
- మా ఆత్మగౌరవం కాపాడిన ప్రజా ప్రభుత్వానికి, జేఏసీ చైర్మన్ లచ్చిరెడ్డి కి రుణపడి ఉంటాం. జీపీఓల రాష్ట్ర అధ్యక్షులు గరికె ఉపేంద్ర రావు



**ఖమ్మం, ఏప్రిల్ 01, మహా:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకువస్తున్న భూ భారతి చట్టంతోనే భూ సమస్యల శాశ్వత పరిష్కారానికి అసలైన మార్గమని తెలంగాణ ఉద్యోగుల జేఏసీ చైర్మన్ లచ్చిరెడ్డి అభిప్రాయపడ్డారు. మంగళవారం ఖమ్మం లోని ఎన్ ఎస్ పీ గెస్ట్ హౌస్ లో గ్రామ రెవెన్యూ అధికారుల సంక్షేమ సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు గరికె ఉపేంద్ర రావు సారథ్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రాష్ట్ర ఉద్యోగుల జేఏసీ చైర్మన్ లచ్చిరెడ్డి మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ... భూ భారతి చట్టం సమర్థవంతంగా నిర్వహించుకోవడానికి ప్రజా ప్రభుత్వం 10,954 గ్రామ పాలన అధికారుల పోస్టులను మంజూరు చేసిందని అన్నారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత పూర్తి స్థాయిలో రెవెన్యూ శాఖను బలోపేతం చేయడానికి ప్రభుత్వం ముందడుగు వేస్తోందని లచ్చిరెడ్డి అన్నారు. ప్రధానంగా భూ సమస్యల శాశ్వత పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టడంతో పాటు భూ భారతి చట్టం 2025తో రెవెన్యూ వ్యవస్థలో విప్లవాత్మక మార్పులకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నాంది పలికిందని లచ్చిరెడ్డి స్పష్టం చేశారు. ఈ క్రమంలోనే రాష్ట్రంలోని సుమారు 70లక్షల మంది రైతులకు క్షేత్రస్థాయిలో రైతులకు, ప్రజలకు సేవలందించేందుకు 10,954 మంది గ్రామ పాలన అధికారుల పోస్టులను మంజూరు చేశారని తెలిపారు. పూర్వ వీఆర్వోలు, వీఆర్ఏలను మళ్లీ మాతృసంస్థలోకి తీసుకురావడానికి సీఎం రేవంత్ రెడ్డి, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ఇచ్చిన మాట నిలబెట్టుకుని పూర్ వీఅర్వోలు, వీఆర్ ఏ ల కుటుంబాలలో వెలుగులు నింపారని అన్నారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత తొలిసారిగా 33 సెలక్షన్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ల పోస్టుల ఏర్పాటు, తహశీల్దార్లు, ఆర్డీఓలు, జేసీలు కొల్పోయిన అధికారాలను భూభారతి చట్టంతో పునరుద్ధరించుకున్నామని లచ్చిరెడ్డి తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో నిర్వీర్యం అయిన రెవెన్యూ శాఖను బలోపేతం చేసినందుకు గాను సీఎం రేవంత్‌రెడ్డికి, రెవెన్యూ మంత్రి శ్రీనివాస్‌రెడ్డికి లచ్చిరెడ్డి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

గతంలో జీఓ నం.317తో రాష్ట్రంలో ఉద్యోగులను చిన్నాభిన్నం చేసిన నేపథ్యంలో ఉద్యోగులుగా ఉన్న భార్యాభర్తలకు సైతం చెట్టుకొక్కరికి పుట్టకొక్కరికి పోస్టింగ్ లు ఇచ్చారు. జేఏసీ ఉద్యమ ఫలితంగా స్పౌజ్, మెడికల్, తదితర కోణాలలో ప్రభుత్వం బదిలీలను చేసిందన్నారు. రాష్ట్రంలో కొత్త డివిజన్లు, కొత్త మండలాలలో పోస్టుల మంజూరు, జూనియర్ అసిస్టెంట్ల నుంచి డిప్యూటీ కలెక్టర్లు వరకు పదోన్నతులు సాధించడం, తహశీల్దార్లు, ఆర్డీఓలు, జేసీలు గతంలో కొల్పోయిన అధికారాలను భూభారతి చట్టం2025తో పునరుద్ధరణ, పూర్వ వీఆర్ఏలు వేరువేరు జిల్లాలకు బదిలీ అయిన వారిని తిరిగి వారి సొంత జిల్లాకు తీసుకురావడం తెలంగాణ రాష్ట్ర అండతో రాష్ట్ర ఉద్యోగ జేఏసీ ఉద్యోగులకు అండగా నిలిచిందని అన్నారు. 10 ఏళ్ల తర్వాత 330 మందిని అధికారికంగా అవుట్‌సోర్సింగ్ టైపిస్ట్ కమ్ కంప్యూటర్ ఆపరేటర్లుగా నియాకం చేయడం, 670 మంది ఫీల్డ్ అండ్ టెక్నికల్ అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులను ప్రైవేట్ యాజమాన్యం నుండి ప్రభుత్వ కార్పొరేషన్‌కు బదిలీ చేయడం ప్రస్తుత ప్రజాప్రభుత్వం ఉద్యోగులకు మేలు చేసేలా ప్రభుత్వ పెద్దలతో ఒప్పించామని లచ్చిరెడ్డి తెలిపారు. గ్రామ పాలన ఆఫీసర్స్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులుగరికె ఉపేంద్ర రావు మాట్లాడుతూ.. గత చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా వీఆర్వోలు, వీఆర్ఏ లను అన్యాయంగా అర్ధరాత్రి లాటరీ పద్ధతిలో వివిధ శాఖలకు బదిపలీ చేసి ఆత్మాభిమానం దెబ్బతీశారని ఆవేదన వ్యక్తం చేశారు. లచ్చిరెడ్డి గారి సారధ్యంలో వీఆర్వోలకు పూర్వవైభవం సాధించుకుందామని అన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్లు డీఎస్ వెంకన్న, మంగీలాల్, సర్వే విభాగం ఉద్యోగుల సంఘం నాయకులు బుచ్చయ్య, టిజిటీఏ ఖమ్మం, భద్రాద్రి జిల్లా కన్వీనర్ కోట రవికుమార్, టీజీటీఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమేష్ పాక, రాష్ట్ర సెక్రటరీ జనరల్ పూల్ సింగ్ చౌహాన్, టీజీటీఏ కోశాధికారి శ్రీనివాస్ శంకర్రావు, టిజీటీఏ రాష్ట్ర బాధ్యులు ప్రేమ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## హనుమకొండ డివిజన్ పోలీస్ ఠాణాలను సందర్శించిన సీపీ

నేరాల నియంత్రణ, రౌడీ షీటర్ల పై ప్రత్యేక దృష్టి సారించాలి



**హన్మకొండ, మహా;** వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ మంగళవారం హనుమకొండ డివిజన్ పరిధిలోని సుబేదారి, హన్మకొండ, కెయూసి పోలీస్ స్టేషన్లతో పాటు హన్మకొండ ట్రాఫిక్, సుబేదారి మహిళా పోలీస్ స్టేషన్లను సందర్శించారు. వరంగల్ పోలీస్ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన అనంతరం తోలిసారిగా హన్మకొండ డివిజన్ పరిధిలోని పోలీస్ స్టేషన్ల ను పోలీస్ కమిషనర్ సందర్శించారు. ముందుగా పోలీస్ స్టేషన్ పరిసరాలు, సిసి కెమెరాల పని తీరును పరిశీలించారు. అనంతరం స్టేషన్ పరిధిలో విధులు నిర్వహిస్తున్న పోలీస్ అధికారులు, సిబ్బంది వివరాలను సిపి సంబంధిత స్టేషన్ ఇన్‌స్పెక్టర్ల ను అడిగి తెలుసుకొవడంతో పాటు, స్టేషన్ పరిధిలో అత్యధికంగా ఎలాంటి నేరాలు నమోదవుతాయి, స్టేషన్ పరిధిలో ఎన్ని సెక్టార్లు వున్నాయి, సెక్టార్ వారిగా ఎస్.ఐలు నిర్వహిస్తున్న విధులు, వారి పరిధిలోని రౌడీ షీటర్లు, అనుమానితులు వారి ప్రస్తుత స్థితి గతులను సంబంధిత సెక్టార్ ఎస్.ఐ ని క్షుణ్ణంగా అడిగి తెలుసుకున్నారు. అంతేకాకుండా స్టేషన్‌వారిగా బ్లూకోల్ట్స్ సిబ్బంది పనితీరుతో పాటు, వారు నిర్వహించే విధుల సమయాలను పోలీస్ కమిషనర్ స్టేషన్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. తదనంతరం పోలీస్ కమిషనర్ స్టేషన్ అధికారులకు పలు సూచనలు చేస్తూ ప్రతి స్టేషన్ అధికారి తప్పనిసరిగా రౌడీ షీటర్ల ఇండ్లను సందర్శించి వారి స్థితిగతుల పై ప్రత్యక్షంగా ఆరా తీయాలని, ఆర్థిక సైబర్ నేరాలకు సంబంధించి కేవలం కేసు నమోదు చేయడమే తమ బాధ్యత నే కాకుండా సైబర్ నేరాలకు సంబంధించి నేరానికి పాల్పడిన నేరస్థుల మూలాలు కూడా దర్యాప్తు అధికారులు కనిపెట్టి నిందితులను అరెస్టు చేయాలన్నారు. ట్రై సిటి పరిధిలో గంజాయితో పాటు ఇతర మత్తు పదార్థాలకు సంబంధించి క్రయ విక్రయాల పై స్టేషన్ అధికారులు ప్రత్యేక దృష్టి సారించి మత్తు పదార్థాల నియంత్రణకై నిరంతరం పనిచేయాలని. నేరాల నియంత్రణకై విజుబుల్ పోలీసింగ్ అవసరమని, ఇందుకోసం నగరంలో నిరంతం పోలీసులు పెట్రోలింగ్ నిర్వహించాలని పోలీస్ కమిషనర్ స్టేషన్ అధికారులకు సూచించారు. పోలీస్ కమిషనర్ వెంట్ హన్మకొండ ఏసిపి దేవేందర్ రెడ్డి, ట్రాఫిక్ ఏసిపి సత్యనారయణ, ఇన్‌స్పెక్టర్లు సతీష్, సత్యనారయణరెడ్డి , రవి కుమార్, సీతారెడ్డి, సువర్ణతో పాటు స్టేషన్ ఎస్.ఐలు, ఇతర పోలీసు సిబ్బంది పాల్గోన్నారు.



## సన్న బియ్యం పథకం ప్రారంభోత్సవం

**మోత్కూర్, మహా:** యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూరు మున్సిపల్ కేంద్రంలోని దత్తప్పగూడెం మొట్టమొదటిసారిగా తుంగతుర్తి నియోజకవర్గం లో సన్న బియ్యం పథకాన్ని ప్రారంభించి ప్రసంగిస్తున్న తుంగతుర్తి నియోజకవర్గ శాసనసభ్యులు, మందుల సామేల్, దత్తప్పగూడెం గ్రామం లో రేషన్ షాప్ నెం. 6 లో సన్న బియ్యం పంపిణీ పథకాన్ని ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసి సన్న బియ్యం పంపిణీ చేశారు.



## సన్న బియ్యం ప్రారంభోత్సవం చేసిన తహసిల్దార్

**మేళ్లచెరువు, మహా:** మేళ్లచెరువు మండల కేంద్రంలో ఉగాది పర్వదినాన సీఎం రేవంత్ రెడ్డి హుజూర్నగర్ నియోజకవర్గంలో బహిరంగ సభ నిర్వహించి తెలంగాణ రాష్ట్రంలో పేదలందరికీ సన్నబియ్యం లబ్ధి చేకూరేలా ఉగాది రోజున జరిగిన బహిరంగ సభలో ప్రారంభించడం జరిగింది ఇట్టి విషయంలో మంగళ వారం మేళ్లచెరువు మండల కేంద్రంలో తాసిల్దార్ పి. జ్యోతి మండలంలోని అన్ని రేషన్ షాపు సెంటర్లను సందర్శించి సన్న బియ్యం పంపిణీ చేశారు. ఇందులో భాగంగా ఆమె మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ముఖ్య మంత్రి ప్రవేశపెట్టిన మహత్కరమైన కార్యం ఈ సన్న బియ్యం పంపిణీ భారతదేశంలో ఎక్కడా లేని విధంగా ఈ పథకం తెలంగాణ రాష్ట్రంలో ఉండటం చాలా గర్వకారణం అని చెప్పుకొచ్చారు ఇందులో భాగంగా లబ్ధిదారులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇట్టి కార్యక్రమంలో మేళ్లచెరువు మండల నాయకులు. దేవాలయ చైర్మన్ శాగం రెడ్డి శంబిరెడ్డి. ఎక్స్ జెడ్పిటిసి గోవిందరెడ్డి. ఓబీసీ చైర్మన్ శెట్టి రామచంద్రరావు. కాంగ్రెస్ పార్టీ నాయకులు రామకృష్ణ. గజ్జల శంకర్ రెడ్డి. వెంకట్ రెడ్డి. పెళ్లి లచ్చయ్య. తదితర ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

# దొడ్డు బియ్యానికి కాలం చెల్లు

**ప్రతిష్ఠాత్మకంగా సన్న బియ్యం పంపిణీ చేసిన అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు**



**హుజూర్ నగర్, మహా:** తెలంగాణ రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నలమాధ ఉత్తంకుమార్ రెడ్డి ప్రతిష్ఠాత్మకంగా చేపట్టినటువంటి సన్నబియ్యం కార్యక్రమాన్ని మంగళవారం మఠంపల్లి గ్రామంలో మండల అధికారులు కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు సమక్షంలో ఆదూరి కిషోర్ రెడ్డి ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా ప్రారంభించారు.అనంతరం కిషోర్ రెడ్డి,నాయకులు ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి,సివిల్ సప్లై మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. అనంతరం వారు.మాట్లాడుతూ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి చేపట్టినటువంటి ఈ సన్న బియ్యం ద్వారా ఎంతో మంది నిరుపేదలు కడుపు నింపుకుంటూ ఆకలిని తీర్చుకుంటారనీ.స్వతంత్ర భారతదేశంలో తొలిసారిగా తెలంగాణ రాష్ట్రంలో ప్రతి పేదవాడు ఐదేళ్లు నోట్లోకి వెళ్లి తినేలా సన్నబియ్యాన్ని అందించడం ఇది ఒక మహా అద్భుతమైనటువంటి కార్యక్రమం అని ఉత్తమ్ కుమార్ రెడ్డి నిరంతరం ప్రతి పేదవాడు గురించి నిరంతరం ఆలోచన చేసే వ్యక్తి అని నియోజకవర్గంలోని విద్య వైద్య ఉద్యోగ విషయంలో నియోజకవర్గం దేశంలోనే ప్రథమ స్థానంలో ఉంచారన్నారు.ఈ కార్యక్రమంలో మహిళలు, గ్రామ పెద్దలు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.




## ప్రజా పాలనలో అక్రమ అరెస్టులు

**మోత్కూర్, మహా:** యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూరు నుండి హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీకి చెందిన 400 ఎకరాల భూముల్లో జరుగుతున్న పర్యావరణ విధ్వంసానికి వ్యతిరేకంగా, యూనివర్సిటీ విద్యార్థుల ఆందోళనల నేపథ్యంలో, వారికి మద్దతుగా వెళ్తున్నారన్న అనుమానంతో బిఆర్ఎస్వి నాయకులు గణగాని రాజేష్,జంగ శివ,పబ్బు ప్రవీణ్,జిట్ట సాయికుమార్, దాసరి నవీన్ కుమార్ లను ముందస్తు అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్ కు తరలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థుల ఆత్మ బలిదానాల వల్ల ఏర్పాడ తెలంగాణ రాష్టానికి ముఖ్యమంత్రి గా ఉంటూ విద్య వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడుతున్న ఏకైక ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నే అని దుయ్యబట్టారు. రేవంత్ పాలనలో ఏ ఒక్క వర్గం కూడా సంతోషంగా లేదన్నారు,పాలన పై దృష్టి వదిలి అక్రమ సంపాదన పై దృష్టి సాధించారని ఆరోపించారు. పీహెచ్డీ స్కాలర్స్ పై నాన్ బెయిలబుల్ కేసులు పెట్టీ ఆనందిస్తున్న రేవంత్ రెడ్డి మీకు,మీ ప్రభుత్వనికి రోజులు దగ్గరపడ్డవి అని హెచ్చరించారు.

## ధంసమైన ముత్యాలమ్మ ఆలయం



**మోత్కూర్ మహా:** యాదాద్రి భువనగిరిలో మోత్కూరు మున్సిపల్ కేంద్రంలోని అనాజిపురం గ్రామంలో వీడిబి ప్రాజెక్టు డ్రైవర్ల సూపర్వైజర్ల యజమాన్య నిర్లక్ష్యంతో గుడినీ ధ్వంసం చేశారు, రాత్రి సమయంలో రోడ్డు మరమ్మతులు, జరుగుతున్న సమయంలో సర్వీసు రోడ్డు మధ్యలో ఉన్న ముత్యాలమ్మ గుడికి టిప్పర్ రివర్స్ వెళ్లే సమయంలో వెనకాల ఎవరూ లేకపోవడంతో ఈ ప్రమాదం జరిగిందని, నిర్లక్ష్యంగా రోడ్డు మరమ్మతులు నిర్వహిస్తున్నారని ధ్వంసం అయ్యి నెలలు గడుస్తున్న పట్టించుకోని కాంట్రాక్టర్, ప్రభుత్వం, అనాజిపురం గ్రామంలో ఇలలోకి వెళ్లాలన్న వెళ్లకుండా నిర్లక్ష్యంగా రోడ్లను తవ్వి ఎక్కడి సమానులు అక్కడే చిందరమందరగా చేయడంతో గ్రామ ప్రజలు చాలా ఇబ్బందులకు గురి అవుతున్నాము అన్నారు, కాంట్రాక్టర్ పై చర్యలు తీసుకోవాలని తొందరగా పనిని పూర్తి చేయాలని గ్రామ ప్రజలు అన్నారు.

## సన్న బియ్యం పంపిణీ ప్రారంభం చేసిన ఎమ్మెల్యే మందుల సామేల్



**మోత్కూర్, మహా:** యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూరు మున్సిపల్ కేంద్రంలోని దత్తప్పగూడెం గ్రామంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించిన సన్న బియ్యం పంపిణీ కార్యక్రమం తుంగతుర్తి నియోజకవర్గంలో నే మొట్టమొదటిసారిగా ఘనంగా ప్రారంభించడమైంది, అని ఈ కార్యక్రమాన్ని స్థానిక ఎమ్మెల్యే, తుంగతుర్తి శాసనసభ్యులు మందుల సామేల్ అధికారికంగా ప్రారంభించి, లబ్ధిదారులకు సన్న బియ్యాన్ని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సంపన్నులు, పేదవారు అన్నీ ఒకే రకమైన నాణ్యమైన బియ్యం తినాలనే సంకల్పంతో ప్రభుత్వం ఈ పథకాన్ని ప్రవేశపెట్టింది అని అన్నారు. ఇప్పటివరకు పంపిణీ చేస్తున్న దొడ్డు బియ్యం దుర్వినియోగం అవుతున్నట్లు గుర్తించిన ప్రభుత్వం, ప్రజలకు మరింత నాణ్యమైన బియ్యం అందించాలనే ఉద్దేశంతో సన్న బియ్యం పంపిణీ పథకాన్ని అమలు చేసిందని ఆయన వెల్లడించారు.ఉగాది పండుగను పురస్కరించుకుని తెల్ల రేషన్ కార్డు లబ్ధిదారులకు గ్రామాల్లో సన్న బియ్యం అందుబాటులోకి వచ్చింది. ప్రభుత్వ ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు, అధికారులు ఈ కార్యక్రమాల్లో పాల్గొని లబ్ధిదారులకు సన్న బియ్యం అందజేశారు. సంపన్నులు, పేదవారు అందరూ ఒకే రకమైన నాణ్యమైన బియ్యం తినాలనే లక్ష్యంతో ఈ పథకాన్ని అమలు చేస్తున్నామని అధికారులు తెలిపారు. లబ్ధిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని, పథకాన్ని విజయవంతం నే చేయాలని ప్రభుత్వం విజ్ఞప్తి చేశారు. అని అన్నారు ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## కాంగ్రెస్ పార్టీ నాయకుల ఆధ్వర్యంలో సన్న బియ్యం పంపిణీ

**మేళ్లచెరువు,మహా:** మాదారం గ్రామంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు రేషన్ షాపు వద్ద అర్హులకు సన్న బియ్యం పంపిణీ చేశారు కాంగ్రెస్ పార్టీ ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన సన్న బియ్యం పంపిణీ నీలో భాగంగా ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీని పౌరసరఫరాల శాఖ మంత్రివర్యులు ఉత్తంకుమార్ రెడ్డి ఆదేశాలనుసారం గ్రామంలో సన్నబియ్యం పంపిణీ కార్యక్రమంలో భాగంగా మాజీ సర్పంచ్, సునీత బాలరాజు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు భోగాల మోహన్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు మైనార్టీ సెల్ ఎస్.కె అబ్బాస్, పకీర రెడ్డి, ఈ సందర్భంగా పాల్గొని వారు మాట్లాడుతూ మాదారం గ్రామంలో పేద ప్రజలందరూ మూడు పుట్ల ధనవంతులు తినే విధంగా ఇట్టి పథకాన్ని రేవంత్ రెడ్డి సర్కారు తీసుకురావడం నిజంగా మహత్కరమైన కార్యమని ఏ రాష్ట్రంలో లేని విధంగా మన తెలంగాణ రాష్ట్రంలో సన్న బియ్యం పంపిణీ చేయడం సామాన్యమైన విషయం కాదంటూ ఈ ఘనత మన తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డికె దక్కిందన్నారు. ఇందులో భాగంగా హుజూర్నగర్ కాంసెన్సీ లో సన్న బియ్యం ప్రారంభోత్సవానికి కృషి చేసిన కెప్టెన్ ఉత్తంకుమార్ రెడ్డికి మాదారం గ్రామ ప్రజల తరపున ప్రత్యేకమైన ధన్యవాదాలు తెలుపుకుంటున్నామని వారు చెప్పుకొచ్చారు. ఉత్తమ్ పద్మావతి రెడ్డి మా హుజూర్నగర్ నియోజకవర్గానికి ఎన్నో ఎనలేని సేవలు అందించారని ఇకముందు కూడా మాకు ఇలాగే మరెన్నో సేవలందించాలని కోరుకుంటున్నాం వారికి మేము ఎలప్పుడు ఎల్లవేళలా అండదండలతో నిలబడతామని తెలియజే సుక్కుంటున్నాం. ఇట్టి కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బ్లాక్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి మల్ రెడ్డి కృష్ణారెడ్డి, గ్రామ శాఖ అధ్యక్షులు పాలిసెట్టి వెంకయ్య, ఎక్స్ వార్డ్ నెంబర్ షేక్ ఆదాం, సూర్య బాలకృష్ణ, మల్రెడ్డి కోటిరెడ్డి. భోగాల శ్రీనివాసరెడ్డి,కడెం శ్రీను. భోగాల కోటిరెడ్డి. భోగాల శివారెడ్డి, డీలర్ వెంకటేశ్వర్లు,తదితర గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## ప్రజాస్వామ్యంలో ఇది ప్రజాపాలన కాదు

# అక్రమ అరెస్టుల పాలన

**గుండు వెంకటనర్సు, సీపీఎం పార్టీ మండల కార్యదర్శి**



**మోత్కూర్, మహా:** యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూర్ మున్సిపల్ కేంద్రంలో పోలీసుల నిర్బంధాలతో, నిరసనలను పోరాటలను అపాలనుకోవడం ప్రజాస్వామ్యంలో ఇది ప్రజా పాలన కాదని, నిరసన చేసే హక్కు ప్రతిఒక్కరికి ఉందని సిపిఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు బొల్లు యాదగిరి, మండల కార్యదర్శి గుండు వెంకటనర్సు, మండల కమిటీ సభ్యులు దడిపల్లి ప్రభాకర్, అన్నారు. సెంట్రల్ యూనివర్ సిటీ భూమి అమ్మకాని నిరసిస్తూ, రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు నిరసన కార్యక్రమానికి వెళ్లకుండా సిపిఎం పార్టీ నాయకులను అరెస్టు చేయడం జరిగింది. అనంతరం వారు మాట్లాడుతూ. విశ్వవిద్యాలయాలను విద్యా వ్యవస్థను బలోపేతం చేయవలసిన రాష్ట్ర ప్రభుత్వం, ఇందుకు విరుద్ధంగా హైద్రాబాద్ సెంట్రల్ యూనివర్ సిటీకి సంబందించిన 400 ఎకరాల భూమిని ప్రభుత్వం అమ్మకానికి పెట్టె ప్రయత్నం విరమించుకోవాలని, ఆ భూమిని యూనివర్ సిటీ అభివృద్ధికి ఉపయోగించాలని కోరుతూ, సిపిఎం పార్టీ రాష్ట్ర కమిటీ నిరసనకు పిలుపు నిచ్చారని తెలిపారు. వెళ్లకుండా ఎక్కడి వారిని అక్కడ అరెస్టు చేసి, నిర్బదించటం అన్యాయమని, ఎన్నికల ముందు ప్రజాస్వామ్య పునరుద్దరణ తన ఏడో గ్యారెంటిగా ప్రకటించిన కాంగ్రెస్ ప్రభుత్వం, ఇంత అప్రజాస్వామికంగా అరెస్టులతో, నిర్బంధాలతో ప్రభుత్వం నిరంకుశంగా వ్యవహరించటాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. ఇప్పటికై నా ఆ భూమి వేలం పాట ప్రయత్నాలను విరమించుకోవాలని అన్నారు.

## గుర్రంపోడు తండాలో సన్న బియ్యం పథకాన్ని ప్రారంభించిన మాజీ ఎంపీపీ ముడావత్ పార్వతి కొండా నాయక్

**హుజూర్ నగర్,మహా:** మఠంపల్లి మండలంలోని గుర్రం పోడు గ్రామంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పేదలకు సన్న బియ్యం పథకాన్ని మంగళవారం గుర్రం పోడు,మరియు మండలంలోని అన్ని గ్రామాలలో అధికారులు, నాయకులు ఆధ్వర్యంలో లాంచనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దారిద్యరేఖ కు దిగువనున్న వారికి తెల్ల రేషన్ కార్డు లబ్ధిదారులకు ఒక్కరికి 6 కిలో చొప్పున ఉచిత సన్న బియ్యం పంపిణీ ప్రభుత్వం చేస్తుందని తెలిపారు. సూర్యాపేట జిల్లా హుజూర్ నగర్ నియోజకవర్గ వేదికగా నీటిపారుదల మరియు పౌరసరఫరాల శాఖ మంత్రివర్యులు నల్లమాద ఉత్తంకుమార్ రెడ్డితో కలిసి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సన్న బియ్యం పథకాన్ని ప్రారంభించిన సంగతి తెలిసిందే. స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల కోడు దృష్ట్యా హైదరాబాద్ మినహా అన్ని జిల్లాల్లో పంపిణీ కొనసాగిస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా మంగళవారం ఉదయం 8 గంటలకు అన్ని రేషన్ దుకాణాలలో సన్నబియ్యం పథకాన్ని ప్రారంభించారు. తెల్ల రేషన్ కార్డు కలిగి ఉన్న ప్రతి వ్యక్తికి ఉచితంగా 6 కేజీల సన్న బియ్యం ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచులు గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.



## గుండాలలో ఎస్వోటి పోలీసుల దాడులు

**50 క్వింటాళ్ల అక్రమ రేషన్ బియ్యం పట్టివేత**

మోత్కూరు, మహా: యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండలంలోని మాసాన్ పల్లి గ్రామంలో ఎస్వోటి (ఎస్ఓటీ) పోలీసులు అక్రమ రేషన్ బియ్యం నిల్వలపై దాడులు నిర్వహించారు. ఈ దాడిలో ఓ ఇంట్లో అక్రమంగా నిల్వ ఉంచిన 50 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పోలీసులకు ముందస్తు సమాచారం మేరకు దాడి నిర్వహించగా, మోత్కూర్ మండలంలోని ఓ గ్రామ రేషన్ షాపు నుంచి ప్రతి నెలా 20 క్వింటాళ్ల బియ్యం అక్రమంగా కొనుగోలు జరుగుతున్నట్టు తెలుస్తోంది. దీని వెనుక ఉన్న ముఠాను గుర్తించే ప్రయత్నాలు సాగుతున్నాయి. గతంలో పలుమార్లు ఇదే ఇంటి నుంచి రేషన్ బియ్యం నిల్వలు పోలీసులు గుర్తించి పలు కేసులు నమోదు చేసిన, సదరు వ్యాపారి తీరు మార్చు కోకుండా వ్యాపారం కొనసాగిస్తున్నారని పోలీసులో గుర్తించారు. అక్రమ రేషన్ బియ్యం నిల్వలు కలిగి ఉన్న, వ్యాపారం కొనసాగిస్తున్న కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు. ప్రజలు ఈ తరహా అక్రమాలపై సమాచారం ఇచ్చి సహకరించాలని గుండాల పోలీసులు విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతం ఈ కేసుకు సంబంధించిన దర్యాప్తు కొనసాగుతోంది. అని అన్నారు.



# జాతీయస్థాయిలో ఇబ్రహీంపట్నం విద్యార్థులు

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** జాతీయస్థాయిలో పథకాలు సాధించిన పగడాల విఘ్నేష్, వినయ్ లను కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కొంగర విష్ణు వర్ధన్ రెడ్డి అభినందించారు. జాతీయస్థాయి ఉడ్ బాల్ పోటీల్లో 'రజత, బ్రౌంజ్' పతకాలు సాధించిన పగడాల విఘ్నేష్, వినయ్ లను శాలువాతో సత్కరించిన కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కొంగర విష్ణువర్ధన్ రెడ్డి అభినందనలు తెలిపారు. మంగళవారం ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ... ఇబ్రహీంపట్నం నియోజకవర్గానికి చెందిన విద్యార్థులు, జాతీయ స్థాయిలో క్రీడలలో ఇంతటి చక్కటి ప్రదర్శన చేసి పథకాలు సాధించడం చాలా సంతోషంగా ఉందని అన్నారు. మహారాష్ట్రలోని నాగపూర్ జిల్లాలో గత నెల 22 నుంచి 26వ తేదీ వరకు జరిగిన జాతీయ స్థాయి, 13వ సబ్ జూనియర్ ఉడ్ బాల్ ఛాంపియన్స్ టోర్నమెంట్లో, ప్రముఖ ఉడ్ బాల్ కోచ్ ఎండీ రహిమత్ దగ్గర కోచింగ్ తీసుకున్న, మంచాల మండల చెన్నారెడ్డి గూడ గ్రామానికి చెందిన పగడాల విఘ్నేష్ యాదవ్, యచారం మండలం తక్కలపల్లికి చెందిన వినయ్ లు ఈ ఘనత సాధించారని తెలిపారు. తెలంగాణ రాష్ట్రం తరపున జాతీయ స్థాయి ఉడ్ బాల్ టోర్నమెంట్లో అండర్ 15, సబ్ జూనియర్, బాలురు విభాగంలో పాల్గొన్నారు. సింగిల్ ఈవెంట్లో సెమీ ఫైనల్లో తెలంగాణ రాష్ట్రం జట్టు వర్సెస్ మధ్యప్రదేశ్ రాష్ట్ర జట్లతో హెూరా హోరీగా పోరాడి, మూడోవ స్థానం సాధించిన పగడాల విఘ్నేష్ యాదవ్, వినయ్ 'రజత, బ్రౌంజ్' పతకాలు కైవసం చేసుకోవడం పట్ల అభినందనలు తెలిపారు. విద్యార్థులు క్రీడా పోటీలలో రాణించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు చీడెడ్ మాజీ సర్పంచ్ రమాకాంత్ రెడ్డి, చెన్నారెడ్డి గూడా మాజీ సర్పంచ్ చీమల జంగయ్య, విద్యార్థుల తల్లిదండ్రులు, స్నేహితులు పాల్గొన్నారు.

# సన్న బియ్యం పథకాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యేలు

## వరంగల్ జిల్లా పరిధిలోని వివిధ నియోజక వర్గాల్లో ప్రారంభం



**వరంగల్, మహా;** రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకొని ఉగాది పర్వదినాన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా నల్గొండ జిల్లా హుజూర్ నగర్ లో సన్న బియ్యం పథకాన్ని ప్రారంభించిన నేపథ్యంలో వరంగల్ జిల్లా పరిధి లోని వివిధ నియోజక వర్గాల్లో స్థానిక శాసనసభ్యులు ఆయా ప్రాంతాల్లో ఈ పథకాన్ని ప్రారంభించారు. నర్సం పేట నియోజక వర్గం లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో భాగంగా నర్సంపేట మండలం లోని గురిజాల గ్రామంలో జిల్లా కలెక్టర్ డా.సత్య శారద స్థానిక శాసన సభ్యులు దొంతి మాధవ రెడ్డి తో కలిసి ప్రారంభించారు. మంగళవారం పరకాల నియోజకవర్గంలోని సంగెం మండలం కేంద్రంలోని చౌక ధరల దుకాణం నెం.17 తో పాటు, గీసుగోండ మండలం కేంద్రంలోని చౌక ధరల దుకాణం నెం.24 లో స్థానిక శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి సన్న బియ్యం పథకాన్ని ప్రారంభించారు. వర్ధన్నపేట నియోజకవర్గంలోని ఇల్లంద గ్రామం లోని చౌక ధరల దుకాణం నెం.20 యందు స్థానిక శాసనస భ్యులు కే ఆర్ నాగరాజు సన్న బియ్యం పథకాన్ని ప్రారంభించారు. పాలకుర్తి నియోజకవర్గంలోని రాయపర్తి మండలం కేంద్రరంలో స్థానిక శాసనస భ్యురాలు మామిండ్ల యశస్విని రెడ్డి సన్న బియ్యం పథ కాన్ని చౌక ధరల దుకాణంలో ప్రారంభించారు. వచ్చే మూడు రోజుల్లో ఆయా నియోజకవర్గాల్లోని అన్ని చౌక ధరల దుకాణాల్లో సంబంధిత శాసన సభ్యులు, ప్రజా ప్రతినిధులు, అధికారులతో కలిసి ప్రారంభిస్తారు. ఈ కార్యక్రమాలలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, ఆర్ డి ఓలు, సివిల్ సప్లై అధికారులు, తహసీల్దార్లు, తదితరులు, పాల్గొన్నారు.



# మిఠాయిలు పంచుతూ సన్న బియ్యం పంపిణీ

- కాంగ్రెస్ పార్టీ రాష్ట్రనాయకులు కొంగర విష్ణువర్ధన్ రెడ్డి
- ఉచిత సన్నబియ్యం పథకం నిరుపేదలకు వరం
- రుట్లలో కాంగ్రెస్ పార్టీ శ్రేణుల సంబరాలు

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన, ఉచిత సన్నబియ్యం పథకం నిరుపేదలకు వరం లాంటిదని, పేదలందరు దీనిని సద్వినియోగం చేసుకోవాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కొంగర విష్ణువర్ధన్ రెడ్డి అన్నారు. ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి ఆదేశాల మేరకు మంగళవారం మంచాల మండలం, ఆరుట్ల గ్రామంలోని మూడు రేషన్ షాపుల వద్ద లబ్ది దారులకు స్వీట్లు పంచుతూ ఘనంగా సంబరాలు చేసుకుంటూ సన్నబియ్యం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... తెలంగాణలో ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తరువాత పేద ప్రజల సంక్షేమమే లక్ష్యంగా సంక్షేమ కార్యక్రమాలు చేపడుతూ ప్రజల హృదయాల్లో నిలిచిపోతుందని, పేద ప్రజల పట్ల రేవంత్ రెడ్డి ప్రభుత్వం తీసుకుంటున్న పథకాల వల్ల ప్రజలు సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ సాతిరి ఎల్లేష్, మాజీ ఎంపిటీసీలు కావలి శ్రీనివాస్, లాలగారి శ్రీకాంత్, కాంగ్రెస్ పార్టీ అధ్యక్ష కార్యదర్శులు రావుల భాషయ్య, దాసరమోని రమేష్, ఇందిరమ్మ కమిటీ సభ్యులు చెరుకు నర్సింహా, బుట్టి కృష్ణ, మార లక్ష్మణ్, కంబాలపల్లి బుగ్గరాములు, కోరే బాబు, కాంగ్రెస్ పార్టీ నాయకులు గుడ్డిమల్ల చంద్రయ్య పాల్గొన్నారు.

# ఉచిత సన్న బియ్యం పంపిణీ

**తొర్రూర్ ,మహా;** మహబూబాబాద్ జిల్లా తొర్రూర్ మండలంలోని నాంచారి మాదూరు గ్రామంలో ప్రభుత్వం చేపట్టిన సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో దొడ్డు బియ్యం పంపిణీ చేశారు అవి అందరూ అమ్ముకునేవాళ్ళు.లేదా దోశలు వేసుకునేవాళ్ళు అన్నం వండుకునే వాళ్ళ సంఖ్య వెళ్ళ మీద లెక్కపెట్టవచ్చు. కానీ ప్రజాప్రభుత్వం కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక మంచి ఆలోచనతో పేదవారికి ఉపయోగపడేటట్లుగా ఉండాలని దొడ్డు బియ్యం అంత వృథాగా పోతుందని.. ప్రభుత్వ సొమ్ము ఖర్చు అవుతుందని దీన్ని ఆలోచించి సన్న బియ్యం అయితే అందురు వండుకొని తింటారని ఆలోచన చేసి సన్న బియ్యం పంపిణీ కార్యక్రమం చేపట్టడం జరిగిందనన్నారు. ఏ పథకం తీసుకున్న కూడా సంవత్సరం కాలంలో పేదవాళ్ళకు ఏ విధంగా ఉపయోగపడుతుందనే ఆలోచనతోనే ప్రభుత్వం ముందుకు పోతుందన్నారు.తక్కువ ఖర్చుతోనే ఎక్కువ సాగునీరు అందించే ప్రాజెక్ట్ లకు ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందన్నారు.మాటలతో మూటలు కట్టే ప్రభుత్వం కాదని నియోజకవర్గానికి



3500 ఇండ్లు వచ్చినవని అర్హులైన పేదవారికి ఏ పార్టీ అని చూడకుండా ఇవ్వడం జరుగుతుందని అన్నారు



# ఉత్తమ్ కుమార్ రెడ్డి పద్మావతి రెడ్డిల వివాహా వార్షికోత్సవ శుభాకాంక్షలు

## హుజూర్ నగర్ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు చప్పిడి సావిత్రి

**హుజూర్ నగర్, మహా:** హుజూర్ నగర్, కోదాడ నియోజకవర్గాల ప్రజలె మా బిడ్డలు అంటు వారి శ్రేయస్సు కోసం పరితపించే నాయకులు నిరంతరం ప్రజా సమస్యలపై పోరాటం చేస్తూ కనీవిని ఎరగని రీతిలో నియోజక వర్గాలను అభివృద్ధి పథంలో రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో ఉంచేందుకు అహర్నిశలు కృషి చేస్తున్న ఉత్తమ్ కుమార్ రెడ్డి, పద్మావతి రెడ్డిలకు వివాహా వార్షికోత్సవ సందర్భంగా హుజూర్ నగర్ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు చప్పిడి సావిత్రి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ఉత్తమ్ కుమార్ రెడ్డి, పద్మావతి రెడ్డి దంపతులు నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో మరెన్నో వివాహా వార్షికోత్సవాలు జరుపుకోవాలని మన స్ఫూర్తిగా కోరుకుంటూ హుజూర్ నగర్ ఏరియా ఆసుపత్రిలో పేషెంట్లకు అందరికీ పండ్లు, బ్రెడ్ ప్యాకెట్ల పంపిణీ చేసి మహిళా కాంగ్రెస్ ఆధ్వర్యంలో పెళ్లిరోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పటాన్ ఆశ, గడ్డం వెంకటమ్మ, పాశం కోటమ్మ, జక్కుల సుజాత, ఓర్సు లక్ష్మి, చిట్టిపాక విజయ కుమారి తదితరులు పాల్గొన్నారు.

# శ్రీపాదరావు స్మారక వాలీబాల్ క్రీడలు ప్రారంభం

**కాటారం, మహా :** మాజీ స్పీకర్ శ్రీపాదరావుస్మారక జిల్లా స్థాయి వాలీబాల్ క్రీడా పోటీలుమహాదేవపురం మండలంలోని అంబటిపల్లి గ్రామంలో మంగళవారం ప్రారంభమయ్యాయి. యువజన కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు అంబట్ పల్లి మాజీ సర్పంచ్ ఎరవెల్లి విలాస్ రావు ఆధ్వర్యంలో జిల్లా స్థాయి వాలీ బాల్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నారు. టోర్నమెంట్ ప్రారంభోచ్చావనికీ ముఖ్య అతిధిగా బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు కోట రాజబాబు,జిల్లా నలుమూలల నుండి 40 టీం లు వాలీబాల్ టీం సభ్యులకు జెర్సీలు స్పాన్సర్ చేశారు. ఈ టోర్నమెంట్ లో పాల్గొన్నా టీం సభ్యులకు టోర్నమెంట్ నిర్వాహకులు అన్నదానం సౌకర్యం కల్పించారు. ఈ కార్యక్రమములో మహిళ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు అగోతు సుగుణ , మంథని డివిజన్ యువజన కాంగ్రెస్ అధ్యక్షులు చీమల సందీప్, మలహార్ మండల అధ్యక్షులు బడితల రాజయ్య,ఎస్సి సెల్ మండల అధ్యక్షులు లేతకారి రాజబాబు, మహిళా అధ్యక్షురాలు బందెల సత్తమ్మ,యువజన కాంగ్రెస్ సీనియర్ నాయకులు కట్కూం అశోక్, బ్లాక్ మైనార్టీ అధ్యక్షులు అశ్రర్, మండల మైనార్టీ అధ్యక్షులు ఇజ్జజ్, మాజీ కాళేశ్వరం దేవస్థాన చెర్మన్ వామన్ రావు,మండల ప్రధాన కార్యదర్శి చేకూర్తి శంకరయ్య,కాటారం యువజన కాంగ్రెస్ అధ్యక్షులు మహేష్,క్రీడాకారులు పాల్గొన్నారు.

# ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను సందర్శించిన డీఎంహెచ్ఓ



**వరంగల్ మహా:** వరంగల్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం కీర్తి నగర్ ఆరోగ్య మహిళా క్లినిక్ ను సందర్శించి వైద్య సిబ్బంది ప్రజలకు అందించవలసిన వైద్య సేవలు, సమయపాలన తప్పనిసరిగా పాటించాలని వరంగల్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి సాంబశివరావు అన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను చేరుకోవాలని మాతా శిశు సంరక్షణ, ప్రభుత్వ హాస్పిటల్స్ లో డెలివరీలు, వ్యాధి నిరోధక టీకాలు, అందించాలని సంక్రమిత వ్యాధులు, అసంక్రమిత వ్యాధులు నిర్ధారణ పరీక్షలు చేయించి తగు చికిత్సలు అందించాలని కోరారు. ఈ సందర్భంగా ప్రజలు వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది సూచనలు పాటిస్తూ ఆరోగ్యంగా ఉండాలని సూచించారు. ఏమైనా ఆరోగ్య సమస్యలు తలెత్తినప్పుడు వెంటనే వైద్య సిబ్బంది ద్వారా తగు చికిత్సలు తీసుకోవాలని కోరారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, పల్లె దవఖానాలు ప్రజల ఆరోగ్య చికిత్స అవసరాలకు ప్రభుత్వం నిర్మించిందని సిబ్బంది సమయపాలన పాటించి ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని సూచించారు. అనంతరం డిఎంహెచ్వో వైద్యాధికారులు సిబ్బంది ప్రజలకు అందించవలసిన సేవల గురించి సిబ్బంది విధుల గురించి తగిన సూచనలు చేస్తూ సమయపాలన పాటించని ఉద్యోగుల పై చర్యలు ఉంటాయని తెలిపారు. ఎండాకాలం లో వచ్చే ఆరోగ్య సమస్యలు నీళ్ల విరోచనాలు, బంక విరోచనాలు, అంటువ్యాధులు,వడ దెబ్బ గురించి తీసుకోవల్సిన జాగ్రత్తల గురించి ప్రజలలో అవగాహన కల్పించడంతోపాటు వ్యాధులకు గురి అయిన వెంటనే వారికి తగిన చికిత్సలు అందించాలని తెలిపారు. ఎండాకాలంలో ప్రతి ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రాలలో ఓఆర్ఎస్ ప్యాకెట్లు ఓఆర్ఎస్ కార్నర్ పెట్టాలని తెలిపారు. గడువు దాటి పోయిన మందులు ఏమైనా ఉంటే వెంటనే వాటిని డిస్పోజేయాలని కోరినారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారిని డాక్టర్ జాబిలి, డిప్యూటీ డెమో అనిల్ కుమార్, ఎల్డి కంప్యూటర్ నాగరాజు, వైకుంఠం, తో పాటు ఇతర వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



# సన్న బియ్యం ప్రజల్లో హర్షం

## ప్రభుత్వంపై పొగడ్తల వర్షం

### పలు చోట్ల సీయం చిత్రపటానికి పాలాభిషేకం

**ఆదిలాబాద్ మహా:** దేశ చరిత్రలోనే మొదటిసారి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా భావించిన రేషన్ కార్డు కలిగిన ప్రతి ఒక్కరికి సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని తెలుగు సంవత్సరాది ఉగాది రోజున చేపట్టింది.ఇవాళ ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా అన్ని పౌర సరఫరాల చౌకధరల దుకాణాలలో సన్నబియ్యం పంపిణీ కార్యక్రమాన్ని కలెక్టర్ ,అధికారులు, కాంగ్రెస్ నాయకులు అట్టహాసంగా ప్రారంభించారు.ఆనాడు కాంగ్రెస్ పాలనలో ఆహార భద్రత చట్టం తీసుకువచ్చి ప్రజా పంపిణీ వ్యవస్థను పటిష్ఠం చేశారని, నేడు రాష్ట్ర ప్రభుత్వం కూడా అదే బాటలో సన్న బియ్యం పంపిణీ చేసి ప్రజల మన్నలను పొందుతుందని వారన్నారు. సన్న బియ్యం పంపిణీ ద్వారా పేదలకు మరింత లాభం చేకూరుతుందని ,రేషన్ కార్డు కలిగి ఉన్న ప్రతి నిరుపేదకు లాభం చేకూర్చే విధంగా సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిందని అన్నారు. ప్రభుత్వం పంపిణీ చేసే ఫోర్టిఫైడ్ రేషన్ బియ్యం లో అత్యధిక విలువ గల పోషకాలు, విటమిన్లు ఉంటాయని, వీటి ద్వారా రక్తహీనత, జీర్ణ సమస్యలు రాకుండా ఉంటాయని తెలిపారు. రేషన్ బియ్యాన్ని ప్రజలు ఎవరు దళారులకు అమ్మవద్దని తెలిపారు. రేషన్ కార్డు లబ్ధిదారులకు ఒక్కొక్కరికి 6 కిలోల చొప్పున ప్రభుత్వం ఉచితంగా అందజేస్తుందన్నారు.గత ప్రభుత్వ హయాంలో పేద ప్రజలకు సన్న బియ్యం పంపిణి చేస్తామన్న హామీ మాటలకే పరిమితం అయింది తప్ప ఎక్కడ కూడా అమలు కాలేదని అన్నారు. రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం పేద ప్రజల కొరకు నాణ్యమైన సన్న బియాన్ని పంపిణి చేయడం పట్ల ప్రజలు హర్ష్యం వ్యక్తం చేస్తు పలు చోట్లసీయం రేవంత్ రెడ్డి చిత్ర పటానికి పాలాభిషేకం చేసారు.

# దేవాలయ నిర్మాణానికి విరాళం అందించిన వీఎన్ఆర్ ఫౌండేషన్

**కరీంనగర్ మహా:** సమాజ శ్రేయస్సు కోరేవారికి సమాజంలో అత్యుత్తమ స్థానం లభిస్తుందని సామాజిక సేవా కార్యక్రమాలను చేయడం ద్వారా ఎంతో తృప్తినిస్తుందని వీఎన్ఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు అల్ఫోర్స్ డా.వి.నరేందర్ రెడ్డి అన్నారు.. శ్రీ లక్ష్మీ ఆలయ అభివృద్ధి కమిటీ వారిచే ఏర్పాటు చేయబడినటువంటి ప్రత్యేక సమావేశానికి హాజరయ్యారు .ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేవాలయాలు నిర్మించడం వలన సమాజంలో సుఖసంతోషాలు వెల్లివిరుస్తాయని ప్రజలందరూ శాంతియుత జీవనాన్ని కొనసాగించేందుకు అవకాశం ఉంటుందని వారు చెప్పారు.వీఎన్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఎన్నో దేవాలయాలకు విరాళాలు ఇవ్వడం జరిగిందని అన్నారు .. చరిత్ర గల దేవాలయాల పునర్నిర్మాణం కోసం కూడా చేయూతనందించిందని తెలుపుతూ ఈ సేవా భావం ప్రక్రియ కొనసాగింపులో భాగంగా నేడు లక్ష్మీపూర్ లో శ్రీ లక్ష్మీ దేవాలయ కమిటీ వారి ఆధ్వర్యంలో నిర్మింపబడుతున్న శ్రీ పంచముఖ



ఆంజనేయ స్వామి దేవాలయానికి రూ.1,01,116/ విరాళం ఇవ్వడం జరిగిందని చెప్పారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్నటువంటి సభ్యులను సూచిస్తూ సకాలంలో ఆలయ నిర్మాణాన్ని పూర్తి చేసి భక్తులకు అందుబాటులోకి తీసుకురావాలని వారు కోరారు ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు బుర్ర శరత్ బాబు, కోశాధికారి సిహెచ్. జితేందర్రావు, ప్రసాద్, కిరణ్ రవీందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# సంతోషంలో రేషన్ కార్డు లబ్ధిదారులు

## దేశ చరిత్రలోనే గర్వించదగ్గ విషయం

### గ్రామశాఖ అధ్యక్షులు ఎక్కే శర్మంద గడ్డమల్లయ్య గూడలో సన్న బియ్యం పంపిణీ

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** గడ్డమల్లయ్య గూడ గ్రామంలో సన్న బియ్యం పంపిణీ పథకాన్ని, కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రారంభించడం జరిగింది. సంతోషం వ్యక్తం చేసిన రేషన్ కార్డు లబ్ధిదారులు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన సన్న బియ్యం పంపిణీ కార్యక్రమంలో భాగంగా "ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి ఆదేశాల మేరకు" మంగళవారం యాచారం మండలం, గడ్డమల్లయ్య గూడ గ్రామంలో రేషన్ కార్డు లబ్ధిదారులకు, ప్రజా ప్రభుత్వం అందించిన సన్న బియ్యం పంపిణీ పథకాన్ని, మాజీ సర్పంచ్ గుండ్లపల్లి సురేందర్ రెడ్డి, గ్రామశాఖ అధ్యక్షులు ఎక్కే శర్మంద కలిసి ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ... దేశంలో ఎక్కడా లేని విధంగా ఈ కార్యక్రమాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ప్రవేశపెట్టడం గర్వించదగ్గ విషయమన్నారు. పేద ప్రజల గుండె చప్పుడు మన ప్రజా ప్రభుత్వం అన్నారు. ప్రతి ఒక్కరికి సంక్షేమ ఫలాలు అందిచడమే మన ప్రభుత్వం ఉద్దేశం అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఇందిరమ్మ కమిటీ మెంబర్ అవ బీరప్ప, మాజీ ఉప సర్పచ్ యార అశోక్, అర్ల జంగయ్య, గ్రామ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.





# డివిజన్ అధ్యక్షుడిని పరామర్శించిన ఎర్రబెల్లి ప్రదీప్ రావు

**వరంగల్, మహా:** వరంగల్ తూర్పు నియోజకవర్గం లోని భారతీయ జనతా పార్టీ 24వ డివిజన్ అధ్యక్షులు జెట్లింగ్ శివప్రసాద్ కు ఇటీవల కాలికి గాయం కావడంతో విషయం తెలుసుకున్న బిజెపి రాష్ట్ర నాయకులు వరంగల్ అర్బన్ కోఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ ఎర్రబెల్లి ప్రదీప్ రావు వారి నివాసానికి వెళ్లి శివ ప్రసాద్ ఆరోగ్య పరిస్థితి ని అతని క్షేమ సమాచారాన్ని అడిగి తెలుసుకుని మనో ధైర్యాన్ని కల్పించారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రత్నం సతీష్ షా, మండల అధ్యక్షులు సీత నాగరాజు, బిజెపి సీనియర్ నాయకులు సోమేశ్వర్ వర్మ, బిజెపి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# జాతీయస్థాయిలో ఇబ్రహీంపట్నం విద్యార్థులు

## ఉడ్ బాల్ జాతీయ పోటీలలో 'రజత, బ్రౌంజ్' పథకాలు

## అభినందించిన కాంగ్రెస్ నాయకులు విష్ణువర్ధన్ రెడ్డి

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** జాతీయస్థాయిలో పథకాలు సాధించిన పగడాల విఘ్నేష్, వినయ్ లను కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కొంగర విష్ణువర్ధన్ రెడ్డి అభినందించారు. జాతీయస్థాయి ఉడ్ బాల్ పోటీల్లో 'రజత, బ్రౌంజ్' పతకాలు సాధించిన పగడాల విఘ్నేష్, వినయ్ లను శాలువాతో సత్కరించిన కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కొంగర విష్ణువర్ధన్ రెడ్డి అభినందనలు తెలిపారు. మంగళవారం ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ... ఇబ్రహీంపట్నం నియోజకవర్గానికి చెందిన విద్యార్థులు, జాతీయస్థాయిలో క్రీడలలో ఇంతటి చక్కటి ప్రదర్శన చేసి పథకాలు సాధించడం చాలా సంతోషంగా ఉందని అన్నారు. మహారాష్ట్రలోని నాగపూర్ జిల్లాలో గత నెల 22 నుంచి 26వ తేదీ వరకు జరిగిన జాతీయ స్థాయి, 13వ సబ్ జూనియర్ ఉడ్ బాల్ ఛాంపియన్స్ టోర్నమెంట్లో, ప్రముఖ ఉడ్ బాల్ కోచ్ ఎండీ రహిమత్ దగ్గర కోచింగ్ తీసుకున్న, మంచాల మండల చెన్నారెడ్డి గూడ గ్రామానికి చెందిన పగడాల విఘ్నేష్ యాదవ్, యచారం మండలం తక్కలపల్లికి చెందిన వినయ్ లు ఈ ఘనత సాధించారని తెలిపారు. తెలంగాణ రాష్ట్రం తరపున జాతీయ స్థాయి ఉడ్ బాల్ టోర్నమెంట్లో అండర్ 15, సబ్ జూనియర్, బాలురు విభాగంలో పాల్గొన్నారు. సింగిల్ ఈవెంట్లో సెమీ ఫైనల్లో తెలంగాణ రాష్ట్రం జట్టు వర్సెస్ మధ్యప్రదేశ్ రాష్ట్ర జట్లతో హెూరా హోరీగా పోరాడి, మూడోవ స్థానం సాధించిన పగడాల విఘ్నేష్ యాదవ్, వినయ్ 'రజత, బ్రౌంజ్' పతకాలు కైవసం చేసుకోవడం పట్ల అభినందనలు తెలిపారు. విద్యార్థులు క్రీడా పోటీలలో రాణించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు చీడెడ్ మాజీ సర్పంచ్ రమాకాంత్ రెడ్డి, చెన్నారెడ్డి గూడా మాజీ సర్పంచ్ చీమల జంగయ్య, విద్యార్థుల తల్లిదండ్రులు, స్నేహితులు పాల్గొన్నారు.



# ఈ రూల్ అతిక్రమిస్తే.. డ్రైవింగ్ లైసెన్స్ సస్పెండ్!




ట్రాఫిక్ జరిమానాల రికవరీని వేగవంతంగా చేయడానికి.. కఠినమైన చర్యలు తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వం యోచిస్తోంది. ఇందులో భాగంగానే ట్రాఫిక్ ఈచలానాలు చెల్లించని వారి డ్రైవింగ్ లైసెన్స్ సస్పెండ్ చేసే అవకాశం ఉంది. వాహనదారులు లేదా వాహన యజమానులు తన చలానాలను మూడు నెలల లోపల చెల్లించాలి. లేకుంటే.. కొత్త ముసాయిదా నిబంధనల ప్రకారం డ్రైవింగ్ లైసెన్స్ సస్పెండ్ చేస్తారు. ఒక ఆర్థిక సంవత్సరంలో.. సిగ్నెల్ జంప్ చేయడం లేదా ర్యాష్ డ్రైవింగ్ చేస్తూ మూడు సార్లు చలానాలకు గురైతే.. వారి డ్రైవింగ్ లైసెన్స్ మూడు నెలల పాటు సస్పెండ్ చేస్తారు. వెహికల్ ఇన్సూరెన్స్ ప్రీమియంలకు కూడా ట్రాఫిక్ ఈచలానాలతో అనుసంధానం చేయాలని ముసాయిదా నిబంధనలో వెల్లడించారు. కాబట్టి డ్రైవర్ ఒక ఆర్థిక సంవత్సరంలో.. రెండు లేదా అంతకంటే ఎక్కువ చలానాలు చెల్లించకుండా తప్పించుకుంటూంటే..వారు ఎక్కువ ప్రీమియం చెల్లించాల్సి ఉంటుంది.

**రోడ్డు ప్రమాదాలు**

ప్రపంచంలో ఎక్కువ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్న దేశాల జాబితాలో భారత్ ఒకటిగా ఉంది. మన దేశంలో సుమారు 4,80,000 రోడ్డు ప్రమాదాలు జరిగాయని, ఇందులో 1,80,000 మంది మరణించగా.. 4,00,000 మంది తీవ్రంగా గాయపడ్డారని కేంద్ర రోడ్డు రవాణా & రహదారుల మంత్రి నితిన్ గడ్కరీ వెల్లడించారు. ఈ మరణాలలో 1,40,000 మంది 18 నుంచి 45 ఏళ్ల వయసున్నవారే అని ఆయన అన్నారు. భారతదేశంలో రోడ్డు ప్రమాదాల సంఖ్యను తగ్గించడానికి ప్రభుత్వం అన్ని విధాలుగా చర్యలు తీసుకుంటూ ఉంది. ఇందులో భాగంగానే.. జాతీయ రహదారులను విస్తరించడం, ట్రాఫిక్ నియమాలను కఠినతరం చేయడం వంటి వాటితో పాటు భారీ జరిమానాలు విధించడం వంటివి చేస్తోంది. ట్రాఫిక్ రూల్ అతిక్రమించి చలానాలు కట్టకుండా తప్పించుకునే వారిని కూడా వదిలిపెట్టకూడదనే ఉద్దేశ్యంతో.. కేంద్రం ఇప్పుడు డ్రైవింగ్ లైసెన్స్ రద్దు చేయనున్నట్లు ప్రకటించింది. ఢిల్లీలో ట్రాఫిక్ చలాన్ల రికవరీ రేటు కేవలం 14 శాతం మాత్రమే. ఇది కర్ణాటకలో 21 శాతం, తమిళనాడు & ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల్లో 27 శాతంతో ఉన్నాయి. మహారాష్ట్ర, హర్యానాలో ట్రాఫిక్ చలాన్ రికవరీ రేట్లు వరుసగా 62, 76 శాతంగా ఉన్నాయి.



## భారీ నష్టాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు

మంగళవారం ఉదయం నష్టాలతో ప్రారంభమైన దేశీయ స్టాక్ మార్కెట్లు.. ట్రేడింగ్ ముగిసే సమయానికి నష్టాల్లోనే ముగిశాయి. సెన్సెక్స్ 1,307.27 పాయింట్లు లేదా 1.69 శాతం నష్టంతో.. 76,107.66 వద్ద, నిఫ్టీ 339.50 పాయింట్లు లేదా 1.44 శాతం నష్టంతో.. 23,179.85 వద్ద నిలిచాయి. కనాని ఇండస్ట్రీస్, హెస్టర్ బయోసైన్సెస్, రేడియంట్ క్యాష్ మేనేజ్‌మెంట్ సర్వీసెస్, ORCHASP, వోడాఫోన్ ఐడియా వంటి కంపెనీలు టాప్ గెయినర్స్ జాబితాలో చేరగా.. పంజాబ్ అండ్ సింధ్ బ్యాంక్, యూసీఓ బ్యాంక్, వన్‌సోర్స్ స్పెషాలిటీ ఫార్మా, వైశాలి ఫార్మా, DRC సిస్టమ్స్ ఇండియా మొదలైన కంపెనీలు నష్టాల జాబితాలో నిలిచాయి.



## నాలుగు లక్షల నెంబర్లు లీక్

### రేపు ఒకరి అరెస్ట్ తప్పదు

సోషల్ సెక్యూరిటీ డేటాబేస్ నుంచి నాలుగు లక్షల మంది వ్యక్తిగత సమాచారాన్ని దొంగిలించి విక్రయించాడనే ఆరోపణలపై ఒక వ్యక్తిని త్వరలో అరెస్టు చేస్తామని ప్రపంచ కుబేరుడు, టెస్లా అధినేత 'ఎలాన్ మస్క్' తెలిపారు. దీనికి సంబంధించిన ఒక ట్వీట్ కూడా నెట్టింట్లో వైరల్ అవుతోంది. సోషల్ సెక్యూరిటీ డేటాబేస్ నుంచి దొంగలించిన నాలుగు లక్షల నెంబర్లు, వ్యక్తిగత సమాచారం.. అక్రమ వలసలు, అమెరికా పౌరులు కానివారు ఓటు వేయడానికి అనుమతిస్తామని మస్క్ పేర్కొన్నారు. అంతే కాకుండా..సామాజిక భద్రత, వైద్య సంరక్షణ, నిరుద్యోగ భృతి, ఐఆర్ఎస్ వాపసులను దుర్వినియోగం చేస్తున్నారని ఆరోపిస్తూ, పత్రాలు లేని వలసదారులు ప్రయోజనాలను పొందడాన్ని డెమొక్రాట్లు సులభతరం చేస్తున్నారని ఆయన ఆరోపించారు. విపత్తు సహాయానికి ఉద్దేశించిన నిధులు కూడా దుర్వినియోగం అయ్యాయని మస్క్ ఆరోపించారు. జాతీయ విపత్తుల వల్ల బాధపడుతున్న అమెరికన్లకు సహాయం చేయడానికి ఉద్దేశించిన ఎఫ్ఈఎమ్ఏ నిధులను దారి మళ్లించి, న్యూయార్క్‌లోని లగ్జరీ హోటళ్లకు అక్రమంగా నివసించేవారి కోసం చెల్లించడానికి ఉపయోగించారని అన్నారు.





## ఎస్‌బీఐ సేవల్లో అంతరాయం

### నిలిచిపోయిన ట్రాన్సాక్షన్స్

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (SBI) కస్టమర్లు ఆన్‌లైన్ సేవలతో సమస్యలను ఎదుర్కొంటున్నారు. వెబ్‌సైట్ పర్ఫామెన్స్ ట్రాకింగ్ ప్లాట్‌ఫామ్ డౌన్‌డెటెక్టర్ ప్రకారం, ఈరోజు ఉదయం 8:15 గంటలకు ఈ అంతరాయం ప్రారంభమైంది. 11:45 గంటలకు సమస్య తీవ్రమై 800 కంటే ఎక్కువ ఫిర్యాదులు వచ్చాయి. వార్షిక ముగింపు కార్యకలాపాల కారణంగా.. ఏప్రిల్ 1 మధ్యాహ్నం 1:00 గంట నుంచి సాయంత్రం 4:00 గంటల వరకు ఇంటర్నెట్ బ్యాంకింగ్, యోనో లైట్, యూపీఐ సేవల వంటి డిజిటల్ సర్వీసులు అందుబాటులో ఉండవని.. ఈ అంతరాయానికి క్షమించమని ఎస్‌బీఐ తన ఎక్స్ ఖాతా ద్వారా వెల్లడించింది. డౌన్‌డెటెక్టర్ ప్రకారం, సుమారు 64 శాతం మొబైల్ బ్యాంకింగ్‌కు సంబంధించిన ఫిర్యాదులు, 33 లావాదేవీలకు సంబంధించిన ఫిర్యాదులు వచ్చాయి. ఈ అంతరాయం నుంచి బయటపడటానికి కస్టమర్లు యూపీఐ లైట్, ఏటీఎమ్ ఉపయోగించుకోవచ్చని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వెల్లడించింది.

## చాట్‌జీపీటీ యూజర్లకు గుడ్‌న్యూస్

ఓపెన్‌ఏఐ సీఈఓ శామ్ ఆల్ట్‌మన్ ఇటీవల చాట్‌జీపీటీ వినియోగదారుల కోసం కీలక అప్‌డేట్‌ను ప్రకటించారు. ఇటీవల చాట్‌జీపీటీలో వైరల్‌గా మారిన ఏఐ ఇమేజ్ జనరేషన్ టూల్ జీబ్లీ సర్వీసును సబ్‌స్క్రిప్షన్ తీసుకోని వినియోగదారులకు కూడా అందిస్తున్నట్లు తెలిపారు. ఈమేరకు తన ఎక్స్ (గతంలో ట్విట్టర్) ఖాతాలో పోస్ట్ చేశారు. 'చాట్‌జీపీటీ ఇమేజ్ జనరేషన్ ఇప్పుడు ఉచిత వినియోగదారులకూ అందుబాటులోకి వచ్చింది' అని శామ్ ఆల్ట్‌మన్ పోస్ట్‌లో పేర్కొన్నారు. ఇప్పటివరకు జీపీటీ4ఓ యూజర్లకు అందుబాటులో ఉండేది. దాన్ని ఎలాంటి సబ్‌స్క్రిప్షన్ తీసుకోనివారికి కూడా అందుబాటులోకి తీసుకొస్తున్నట్లు తెలిపారు. ఏఐ ఇమేజ్ జనరేషన్‌ను యూజర్లందరికీ అందుబాటులోకి తీసుకురావాలనేలా ఇటీవల విభిన్న సామాజిక మాధ్యమాల్లో డిమాండ్ వెల్లువెత్తింది. దాంతో ఈమేరకు ఆల్ట్‌మన్ స్పందించడంపట్ల హర్షం వ్యక్తం చేస్తున్నారు. 26 నెలల క్రితం చాట్‌జీపీటీ ప్రారంభించిన సమయంలో అత్యంత క్రేజ్‌తో క్షణాల్లో ఈ ప్లాట్‌ఫామ్ వైరల్ అయి ఐదు రోజుల్లో 10 లక్షల మంది యూజర్లను సంపాదించుకున్నట్లు ఆల్ట్‌మన్ ఇటీవల చెప్పారు. కానీ కొత్తగా ప్రవేశపెట్టిన బీబ్లీ స్టూడియో ద్వారా చాట్‌జీపీటీ గతంలో కంటే మరింత వైరల్ అయి కేవలం గంటలోనే 10 లక్షల మంది యూజర్ల బేస్‌ను సంపాదించిందని వివరించారు. ప్రస్తుతానికి కంపెనీ మొత్తం వినియోగదారుల సంఖ్యను విడుదల చేయలేదు. ఈ కొత్త ఫీచర్‌ను ఓపెన్‌ఏఐ గత వారం జీపీటీ4ఓలో ప్రవేశపెట్టారు. దీని ద్వారా ఎలాంటి ఎక్స్‌టర్నల్ టూల్స్ అవసరం లేకుండా నేరుగా చాట్‌జీపీటీలోనే టెక్స్, యూజర్ ఫొటోలు అప్‌లోడ్ చేసి బీబ్లీ ఇమేజ్‌లను పొందవచ్చు.

# దేశం-విదేశం NATIONAL-INTERNATIONAL



## అంతరిక్షం నుంచి అద్భుత భారతం

### సునీతా విలియమ్స్

'అంతరిక్షం నుండి భారతదేశం ఎలా ఉంది?' ఈ ప్రశ్నకు నాడు భారత వ్యోమగామి రాకేష్ శర్మ(Indian astronaut Rakesh Sharma) ప్రముఖ కవి ముహమ్మద్ ఇక్బాల్ రాసిన 'సారే జహాన్ సే అచ్చా' అంటూ సమాధానం చెప్పారు. నాలుగు దశాబ్దాల తర్వాత ఇదే ప్రశ్నకు భారత సంతతికి చెందిన వ్యోమగామి సునీతా విలియమ్స్ సమాధానమిచ్చారు. అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం నుంచి అద్భుతమైన హిమాలయాలను చూసిన సంగతిని ఆమె గుర్తుచేసుకున్నారు. 286 రోజుల అంతరిక్ష యాత్ర తర్వాత సునీతను.. భారతదేశం అంతరిక్షం నుండి ఎలా కనిపించింది? అని అడిగినప్పుడు ఆమె 'అద్భుతం.. అత్యద్భుతం' అనే సమాధానం ఇచ్చారు. 'భారతదేశం అద్భుతమైనది. మేము హిమాలయాల(Himalayas) మీదుగా వెళ్లిన ప్రతిసారీ అద్భుత దృశ్యాలను చూశాం' అని సునీతా విలియమ్స్ అన్నారు. తన భారతీయ మూలాల గురించి తరచూ మాట్లాడే అమెరికా వ్యోమగామి సునీత అంతరిక్షం నుంచి భారత్‌కు సంబంధించిన ప్రకృతి దృశ్యాలను చూసి మంత్రముగ్ధురాలయ్యారు. పశ్చిమాన ఉన్న నౌకాదళాల నుండి ఉత్తరాన మెరుస్తున్న హిమాలయాల వరకు అంతా అద్భుతంగా కనిపించింది. తూర్పు నుండి గుజరాత్ మీదుగా ముంబైకి వెళ్ళినప్పుడు అద్భుత దృశ్యం కనిపించింది. భారతదేశం అంతటా రాత్రిపూట లైట్ల నెట్‌వర్క్ అమోఘంగా ఉంది. పగటిపూట కనిపించిన హిమాలయాల సౌందర్యం భారతదేశానికే తలమానికంగా నిలిచింది. భారత అంతరిక్ష విమానయాన కార్యక్రమానికి సహాయం చేస్తారా? అని ఆమెను అడిగినప్పుడు ఎప్పుడో ఒకప్పుడు భారతదేశానికి వస్తాను. మా అనుభవాలను అక్కడివారితో పంచుకుంటాను. భారత్ ఒక గొప్ప దేశం. అద్భుతమైన ప్రజాస్వామ్యం(Democracy) ఇక్కడుంది. భారత్ అంతరిక్షయానంలో ముందడుగు వేస్తోంది. దానిలో భాగం కావడానికి, వారికి సహాయం చేయడం తనకు ఇష్టమేనని ఆమె సమాధానం చెప్పారు. భారతదేశంలో జన్మించిన విలియమ్స్ తన తండ్రి పూర్వీకుల ప్రాంతానికి రావాలని అనుకుంటోంది. తన సహ వ్యోమగామి బుచ్ విల్మోర్‌ను కూడా భారత్‌కు తీసుకురావాలని భావిస్తోంది. సునీతా విలియమ్స్, బుచ్ విల్మోర్ గత ఏడాది జూన్‌లో బోయింగ్ స్టార్‌లైనర్‌లో ఎనిమిది రోజుల మిషన్ కోసం అంతరిక్ష కేంద్రానికి వెళ్లారు. సాంకేతిక సమస్యల కారణంగా అంతరిక్ష నౌక సిబ్బంది లేకుండా తిరిగి వచ్చింది. దీంతో ఈ ఇద్దరు వ్యోమగాములు అంతరిక్షంలో చిక్కుకుపోయారు. వారు చివరికి మొన్న మార్చి 19న స్పేస్‌ఎక్స్ డ్రాగన్ అంతరిక్ష నౌకలో భూమికి తిరిగి వచ్చారు.

## బాణసంచా ఫ్యాక్టరీలో పేలుడు..

### 13 మంది మృతి



బనస్కాంత:గుజరాత్‌లోని బనస్కాంతలోని అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. దీసాలోని జీఐడీసీ ప్రాంతంలోని ఒక బాణసంచా కర్మాగారంలో మంగళవారం ఉదయం ఈ అగ్నిప్రమాదం సంభవించింది. ఈ ఘటనలో 13 మంది మృతి చెందారు. బాయిలర్‌లో పేలుడు సంభవించడంతో మంటలు చెలరేగాయి. ఈ ప్రమాదంలో ప్రాథమికంగా ముగ్గురు మృతిచెందారని భావించారు. అయితే ఆ తరువాత మరో పది మృతదేహాలు లభించడంతో మృతుల సంఖ్య 13కి చేరింది. ఈ ప్రమాదంలో ఐదుగురు గాయపడ్డారు. బాధితులను సమీపంలోని ఆసుపత్రులకు తరలించారు. ఫ్యాక్టరీలోని మండే పదార్థాల కారణంగా మంటలు వేగంగా వ్యాపించాయి. అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని, మంటలను అదుపు చేసేందుకు ప్రయత్నించారు. రెస్క్యూ బృందాలు సహాయక చర్యల్లో పాల్గొన్నాయి. స్థానిక ఎమ్మెల్యే ప్రవీణ్ మాలి సహా సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితులను పర్యవేక్షిస్తున్నారు. పేలుడు కారణంగా భవనంలోని కొంత భాగం కూలిపోయిందని ప్రవీణ్ మాలి తెలిపారు. ఈ అగ్ని ప్రమాదానికి గల కారణం ఇంకా తెలియరాలేదు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## నేడు లోక్‌సభకు వక్ఫ్ బిల్లు..

## బీజేపీ ఎంపీలకు విప్



**ఢిల్లీ:** వక్ఫ్ సవరణ బిల్లును నేడు పార్లమెంట్‌లో ప్రవేశపెట్టేందుకు రంగం సిద్ధమైన తరుణంలో బీజేపీ ఎంపీలకు విప్ జారీ చేసింది ఆ పార్టీ అధిష్టానం. రేపు తప్పనిసరిగి బీజేపీ ఎంపీలంతా లోక్ సభలో ఉండాలంటూ విప్ జారీ చేసింది. అయితే ఈ బిల్లును ఇండియా కూటమి పార్టీలు వ్యతిరేకిస్తున్నాయి. బిల్లు రాజ్యాంగ విరుద్ధమని విపక్షాలు ఆరోపిస్తున్నాయి.

**బిల్లును ప్రవేశపెట్టనున్న మంత్రి కిరణ్ రిజిజు**


వక్ఫ్ సవరణ బిల్లును మైనారిటీ శాఖ మంత్రి కిరణ్ రిజిజు లోక్ సభలో ప్రవేశపెట్టనున్నారు. బుధవారం మధ్యాహ్నం గం. 12.15 ని.లకు వక్ఫ్ బిల్లుపై లోక్‌సభలో చర్చ ప్రారంభం కానుంది. దీనిపై ఎనిమిది గంటలపాటు చర్చ జరపనున్నారు ఎంపీలు. ఈ బిల్లుకు అనుకూలంగా 298 మంది ఎన్డీఏ ఎంపీలు ఉన్నారు. ఈ క్రమంలోనే బీజేపీ ఎంపీలంతా లోక్ సభకు హాజరుకావాలని విప్ జారీ చేశారు. బిల్లు చట్టరూపం దాల్చాలంటే ఈలోగానే ఉభయ సభల ఆమోదం పొందాల్సి ఉంటుంది. బిల్లును ప్రవేశపెట్టడంపై రాజకీయ పార్టీల నేతలతో మాట్లాడి చర్చించనున్నట్లు ప్రభుత్వం ఇప్పటికే సూచనప్రాయంగా తెలిపింది. ముస్లింల ప్రయోజనాలకు భంగకరంగా ఉన్న ఈ బిల్లు చట్ట విరుద్ధమని ప్రతిపక్ష పార్టీలు గట్టిగా వ్యతిరేకిస్తున్నాయి. పలు సవరణలతో పార్లమెంట్ సంయుక్త కమిటీ ఆమోదం పొందిన బిల్లుకు వ్యతిరేకంగా పలు ముస్లిం సంస్థలు ర్యాలీలు సైతం చేపట్టాయి.




## ట్రాఫిక్ సిగ్నల్‌లో భార్య రీల్స్

### ప్రభుత్వ ఉద్యోగం పోగొట్టుకున్న భర్త

**ఛండీఘడ్ :** ట్రాఫిక్ సిగ్నల్ వద్ద ఓ భార్య చేసిన అత్యుత్సాహం భర్త కొంప ముంచింది. ప్రభుత్వ ఉద్యోగం నుంచి సస్పెండయ్యారు. దీంతో భర్త లబోదిబో మంటూ మళ్లీ తనని విధుల్లోకి తీసుకోవాలని ఉన్నతాధికారుల్ని ప్రాధేయపడుతున్నారు. ఇంతకీ ఏం జరిగిందంటే? లేటెస్ట్ ఇంటర్నెట్ సెన్సేషన్ హర్యానా సాంగ్ మ్యూజిక్ లవర్స్‌ని తెగ ఆకట్టుకుంటోంది. అందుకే సమయం ఎప్పుడైనా, సందర్భం ఏదైనా ఉత్తరాది రాష్ట్రాల ప్రజలు ఆ సాంగ్ పాడటం లేదంటే, డ్యాన్స్‌లతో అదరగొట్టేస్తున్నారు. అందుకు సంబంధించిన వీడియోలు వైరల్‌గా మారాయి. ఈ తరుణంలో మార్చి 20న సాయంత్రం 4:30 గంటల సమయంలో జ్యోతి అనే మహిళ తన వదిన పూజతో కలిసి స్థానికంగా ఉండే దేవాలయానికి వెళ్లింది. దైవ దర్శనం అనంతరం తిరుగు ప్రయాణంలో ఛండీఘడ్ సెక్టార్20 గురుద్వారా చౌక్ సిగ్నల్‌లో జ్యోతి అత్యుత్సాహం ప్రదర్శించింది. తన వదిన పూజ సాయంతో హర్యాన్వీ ఫోక్‌సాంగ్‌కు డ్యాన్స్ వేసింది. తన వదిన వీడియో తీస్తే ఆమె డ్యాన్స్ చేసిన దృశ్యాలు సోషల్ మీడియాలో తెగచక్కర్లు కొట్టాయి. ఈ వీడియో వైరల్ కావడంతో, హెడ్ కానిస్టేబుల్ జస్బీర్ చండీగఢ్‌లోని సెక్టార్ 34 పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సంఘటనపై చండీగఢ్ పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. ఏఎస్ఐ బల్జిత్ సింగ్ నేతృత్వంలోని బృందం సెక్టార్ 20లోని గురుద్వారా చౌక్, సెక్టార్ 17లోని పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సీసీటీవీ ఫుటేజ్‌లను సమీక్షించింది. సీసీటీవీ ఫుటేజీల్లో ట్రాఫిక్‌కు అంతరాయం, ప్రజా భద్రతకు ప్రమాదం కలిగించడం వంటి నేరాల కింద డ్యాన్స్ చేసిన జ్యోతిపై, వీడియో తీసిన పూజపై బీఎన్ఎస్ సెక్షన్ 125, 292 3(5) కింద ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. సెక్టార్ 19 పోలీస్ స్టేషన్‌లో సీనియర్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న జ్యోతి భర్త అజయ్ కుందును పదవి నుండి సస్పెండ్ చేశారు. ఎందుకంటే భార్య డ్యాన్స్ వీడియోను అజయ్ తన ఇన్‌స్టాగ్రామ్ అకౌంట్‌లో పోస్ట్ చేయడంపై అతనిపై చర్యలు తీసుకున్నారు. కేసులు నమోదు కావడంతో జ్యోతి,పూజలు బెయిల్ కోసం కోర్టును ఆశ్రయించారు. విచారణ చేపట్టిన కోర్టు ఇద్దరికి బెయిల్ మంజూరు చేసింది



# డబుల్ ధమాకా

ప్రేక్షకులకు డబుల్ ధమాకా ఇవ్వనున్నారు హీరోయిన్ వైష్ణవీ చైతన్య. ఆమె నటిస్తున్న తాజా చిత్రం 'జాక్'లో ఆమె తొలిసారి ద్విపాత్రాభినయం చేస్తుండటం విశేషం. తెలుగమ్మాయి అయిన వైష్ణవీ చైతన్య కెరీర్ ప్రారంభంలో 'లవ్ ఇన్ 143 అవర్స్', 'ది సాఫ్ట్‌వేర్ డెవలపర్', 'అరెరే మానస', 'మిస్సమ్మ' వంటి షార్ట్ ఫిల్మ్స్ చేశారు. ఆ తర్వాత 'అల వైకుంఠపురములో', 'వరుడు కావలెను' చిత్రాల్లో అతిథి పాత్రల్లో నటించిన ఆమె 'బేబీ'(2023) మూవీతో హీరోయిన్‌గా మారారు. సాయి రాజేశ్ దర్శకత్వం వహించిన ఈ మూవీ సూపర్ హిట్‌గా నిలిచి, రూ.100 కోట్లకు పైగా వసూళ్లు సాధించింది. ఈ మూవీతో ఆడియన్స్ లో బోలెడంత క్రేజ్ సొంతం చేసుకున్న వైష్ణవీ చైతన్య ఆ తర్వాత వరుస అవకాశాలతో దూసుకెళుతున్నారు.



# టాలెంట్‌తో పనిలేదు.. అలాంటి వాళ్లకే ఛాన్సులు ఇస్తున్నారు: పాయల్ రాజ్‌పుత్

టాలెంట్ ఎంత ఉన్నా సరే చిత్రపరిశ్రమలో రాణించడం చాలా కష్టమని ఢిల్లీ బ్యూటీ 'పాయల్ రాజ్‌పుత్'అన్నారు. 'RX 100' దర్శకుడు అజయ్ భూపతి సినిమాతో ప్రేక్షకులను మెప్పించిన ఈ బ్యూటీ హిట్ కొట్టింది. ఈ సినిమాతోనే ఆమె తెలుగు వారికి దగ్గరైంది. ఈ మూవీ తర్వాత ఆమె వరుస సినిమాలు చేసినప్పటికీ ఏదీ ఆశించిన ఫలితాన్ని ఇవ్వలేదు. అయితే, చాలారోజుల గ్యాప్ తర్వాత వచ్చిన 'మంగళవారం' సినిమాలో తన నటనతో విశ్వరూపం చూపింది. ఈ సినిమా భారీ విజయం అందుకోవడమే కాకుండా ఒక నటిగా ఆమెకు మంచి మార్కులే పడ్డాయి. 'మంగళవారం'లోని నటనకు గాను జైపుర్ ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ ఉత్తమ నటిగా పాయల్ అవార్డ్ అందుకుంది. అయితే, ఈ సినిమా తర్వాత ఆమెకు భారీ ఛాన్సులు వస్తాయని అందరూ ఆశించారు. కానీ, అలాంటిది ఏమీ జరగలేదు. ఈ క్రమంలో తాజాగా ఇండస్ట్రీపై పాయల్ ఒక పోస్ట్ చేసింది. ఒక నటిగా రాణించడం అనేది అన్నింటికంటే చాలా కష్టంతో కూడుకున్న విషయం. ప్రతిరోజు కూడా అనిశ్చిత భారంతోనే మొదలౌతుంది. ఎందుకంటే నేను ప్రతిరోజూ ప్రతిభను కప్పివేసే నెపోటిజం (బంధుప్రీతి ), పక్షపాతంతో నిండి ఉన్న ప్రపంచంలోకి అడుగుపెడుతున్నాను. నాకొక సందేహం ఉంది. నేను అంకితభావంతో ఎంతో కష్టపడుతున్నప్పటికీ వెలుగులు కనిపించడం లేదు. ఆధిపత్యం చెలాయించే ఈ ప్రపంచంలో నిజంగానే రాణించగలనా అనే సందేహం వస్తుంది. అవకాశాలు వచ్చినట్టే వచ్చే చేయి జారిపోతున్నాయి. కొందరు తమ ఇంటిపేరు ఉపయోగించుకొని ఛాన్సులు తెచ్చుకుంటే మరికొందరు సరైన ఏజెంట్స్ ద్వారా దక్కించుకుంటున్నారు. ఇలాంటివి నేను చాలా గమనించాను. ఇలాంటి ప్రదేశంలో నేను రాణించగలనా అనే సందేహం వస్తుంటుంది.' అని పాయల్ అన్నారు. మంగళవారం (2023) తర్వాత పాయల్ రాజ్‌పూత్ మరో సినిమా నటించలేదు. అంతటి భారీ విజయాన్ని అందుకున్న ఆమెకు అవకాశాలు రాకపోవడం ఏంటి అంటూ నెటిజన్లు కామెంట్ల రూపంలో తెలుపుతున్నారు. కాస్త ఓపిక పడితే తప్పకుండా మంచి ఛాన్సులు వస్తాయని సోషల్‌మీడియా ద్వారా ఆమెకు చెబుతున్నారు. పాయల్ ట్వీట్‌ను తమ అభిమాన హీరోలు, దర్శకులకు ట్యాగ్ చేస్తూ ఒక్క ఛాన్స్ ఇవ్వండి అంటూ రిక్వెస్ట్ చేయడం విశేషం. అలా పాయల్‌పై తమ అభిమానాన్ని చాటుతున్నారు.



# దమ్ముంటే నన్ను, నా సినిమాలను బ్యాన్ చేయండి: నాగవంశీ


ఇటీవల విడుదలైన 'మ్యాడ్ స్క్వేర్' చిత్రం మంచి టాక్‌తో దూసుకెళ్తోంది. మూడురోజుల్లోనే ఈ మూవీ రూ. 50.2 కోట్ల గ్రాస్ కలెక్షన్స్ రాబట్టి ఈ మధ్యకాలం అత్యధిక వసూళ్లను రాబట్టిన చిన్న చిత్రంగా రికార్డు సృష్టించింది. బ్రేక్ ఈవెన్ సాధించడంతో పెంచిన టికెట్ల ధరను సాధారణ స్థాయికి తీసుకువచ్చామని నిర్మాత సూర్యదేవర నాగవంశీ తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో 'మ్యాడ్ స్క్వేర్' సినిమా గురించి నెగెటివ్ ప్రచారం చేస్తున్న వారిపై గ్రహం వ్యక్తం చేశాడు. సినిమా హిట్ టాక్ తెచ్చుకున్నప్పుడు దాన్ని ఎందుకు ప్రోత్సహించరని ఆయన ప్రశ్నించారు. 'సినిమా రిలీజ్ తర్వాత రివ్యూలు వచ్చాయి. అప్పుడు ప్రెస్ మీట్ పెట్టాను కానీ నేను ఏమీ మాట్లాడలేదు. ఎందుకంటే వాళ్ల పని వాళ్లు చేశారు అనుకున్నాను. కానీ, సినిమా బాగా ఆడుతున్నప్పటికీ.. ఆ రివ్యూల మీద సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నారు. 'కంటెంట్ లేకపోయినా సీక్వెల్ కాబట్టి ఆడుతోందని అంటున్నారు. ఈ సినిమ ఎలా ఉన్నా చూడటానికి ఇదేమైనా 'బాహుబలి2', 'పుష్ప2', 'కేజీఎఫ్2' కాదు కదా! సినిమా ఆశించినంత లేకపోయినా చూడటానికి ఇందులో నటించిన వాళ్లేమీ పెద్ద హీరోలు కాదు.

# అల్లు అర్జున్ పేరు మార్చుకోబోతున్నాడా?



సినిమా సెలబ్రిటీలపై ఎప్పటికప్పుడు రూమర్స్ వస్తూనే ఉంటాయి. ఇప్పుడు అలానే అల్లు అర్జున్ (Allu Arjun) గురించి కొన్ని గాసిప్స్ వినిపిస్తున్నాయి. త్వరలో పేరు మార్చుకోబోతున్నాడని పలు ఇంగ్లీష్ వెబ్ సైట్లలో వార్తలు వస్తున్నాయి. ఇంతకీ ఇందులో నిజమెంత? పుష్ప 2 (Pushpa 2 Movie) మూవీతో పాన్ ఇండియా లెవల్లో అల్లు అర్జున్ కి ఊహించని స్టార్ డమ్ వచ్చింది. దీంతో ఆచితూచి మూవీస్ చేస్తున్నాడు. ఇప్పటికే త్రివిక్రమ్ తో సినిమా కన్ఫర్మ్, అట్లీతో కూడా ఖరారైందని అంటున్నారు. పుట్టినరోజున (ఏప్రిల్ 8న) అధికారిక ప్రకటన వస్తుందని సమాచారం. ఇలా కొత్త సినిమా అనౌన్స్ మెంట్ ఎప్పుడొస్తుందా అని అభిమానులు మాట్లాడుకుంటున్న ఈ టైంలో బన్నీ (Bunny) పేరు మార్చుకోబోతున్నాడనే రూమర్స్ వినిపిస్తున్నాయి. సెలబ్రిటీలు జాతకాలు, న్యుమరాలజీ లాంటివి ఎక్కువగా నమ్ముతుంటారు. అలానే న్యూమరాలజీ ప్రకారం.. తన పేరులో అదనంగా ఇంగ్లీష్ అక్షరం U,N గానీ బన్నీ జోడించుకుంటాడని.. ఇలా చేస్తే గుర్తింపు మరింత పెరుగుతుందని నమ్మకమట. మరి బన్నీ పేరు మార్పుపై వస్తున్న రూమర్స్ నిజమా కాదా కొత్త సినిమా ప్రకటిస్తే క్లారిటీ వచ్చేస్తుంది. ఎందుకంటే ఎప్పటిలానే పేరు ఉంటే ఓకే. లేదంటే మార్పు వార్తలు నిజమేనని తేలుతుంది.

## క్రీడా వార్తలు | SPORTS NEWS



# శ్రేయాస్, నేహాల్ వధేరా విధ్వంసక ఇన్నింగ్స్

## చిత్తుగా ఓడిన లక్నో

(మొదటిపేజీ తరువాయి)

ఐపీఎల్ టైటిల్ వేటలో ఉన్న పంజాబ్ కింగ్స్ అదరగొడుతోంది. వరుసగా రెండో మ్యాచ్‌లో శ్రేయాస్ అయ్యర్ సేన ఘన విజయం సొంతం చేసుకుంది. ఆల్‌రౌండ్ షోతో లక్నో సూపర్ జెయింట్‌స్‌ను 8 వికెట్ల తేడాతో మట్టికరిపించింది. 172 పరుగుల ఛేదనలో ఓపెనర్ ప్రియన్ష్ ఆర్య(8) త్వరగానే వెనుదిరిగినా.. ప్రభ్‌సిమ్రాన్ సింగ్(69) మరింత ధాటిగా ఆడాడు. పవర్ ప్లేలో 621తో పటిష్ట స్థితిలో నిలిచిన పంజాబ్ ఇన్నింగ్స్ మరింత వేగంగా సాగింది. అర్ధ శతకం తర్వాత ప్రభ్‌సిమ్రాన్ మరింత ధాటిగా ఆడాడు. ప్రభ్‌సిమ్రన్ 110 వద్ద ఔటయ్యాక కెప్టెన్ శ్రేయాస్ అయ్యర్‌కు జత కలిసిన ఇంప్యాక్ట్ ప్లేయర్ నేహాల్ వధేరా ఆకాశమే హద్దుగా చెలరేగాడు. దొరికిన బంతిని దొరికినట్టు బౌండరీకి పంపి లక్ష్యాన్ని మంచుముక్కలా కరిగించాడు. బిష్ణోయ్ వేసిన 14వ ఓవర్లో ఇంప్యాక్ట్ ప్లేయర్ నేహాల్ వధేరా 6,4, 6 తో 16 రన్స్ పిండుకున్నాడు. అవేశ్ ఖాన్ వేసిన తర్వాతి ఓవర్లో గేర్ మార్చిన శ్రేయాస్ 4, 6 బాదాడు. శార్దూల్ ఠాకూర్‌కు చుక్కలు చూపిస్తూ నేహాల్ వరుసగా రెండుసార్లు బంతిని స్టాండ్స్‌లోకి పంపి జట్టు స్కోర్ 160 దాటించాడు. ఐదో బంతిని బౌండరీకి పంపగా స్కోర్ సమం అయింది. మరుసటి ఓవర్లో అయ్యర్ సిక్సర్‌తో అర్ధ శతకం సాధించి.. జట్టుకు 8 వికెట్ల విజయాన్ని అందించాడు.

### ఆదుకున్న పూరన్, బదోని


హిట్టర్లతో నిండిన లక్నో సూపర్ జెయింట్స్ పెద్ద స్కోర్ చేయలేకపోయింది. పంజాబ్ కింగ్స్ పేసర్ అర్‌ష్‌దీప్ సింగ్(3-43) విజృంభణతో ఆది నుంచి తడబడుతూ సాగింది. పవర్ ప్లేలోనే 3 కీలక వికెట్లు కోల్పోయిన జట్టును నికోలస్ పూరన్(44), ఆయుష్ బదొని(41)లు ఆదుకున్నారు. పంజాబ్ స్పిన్నర్లను దీటుగా ఎదుర్కొంటూ లక్నో స్కోర్‌బోర్డును ఉరికించారు. అర్ధ సెంచరీకి ముందు పూరన్ ఔటైనా.. అబ్దుల్ సమద్(27)తో కలిసి బదొని సాధికారిక ఇన్నింగ్స్ ఆడాడు. దాంతో, పంత్ సేన నిర్ణీత ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 171 పరుగులు చేయగలిగింది.

# వచ్చే వన్డే వరల్డ్ కప్ ఆడుతా.. వీడ్కోలు వార్తలకు చెక్ పెట్టిన కోహ్లీ


భారత జట్టు స్టార్ ఆటగాడు విరాట్ కోహ్లీ అభిమానులకు తీపి కబురు చెప్పాడు. తన వీడ్కోలు గురించి ప్రచారమవుతున్న వదంతులను తోసిపుచ్చాడు. టీ20లకు రిటైర్మెంట్ పలికిన తాను వన్డేలకు అందుబాటులో ఉంటానని, వచ్చే వన్డే వరల్డ్ కప్‌లోనూ ఆడతానని చెప్పాడు విరాట్. ఐపీఎల్ 18వ సీజన్‌లో చెలరేగి ఆడుతున్న కోహ్లీ తాజాగా ఒక ఈవెంట్‌కు హాజరయ్యాడు. అక్కడ నిర్వాహకులు, అభిమానులు అతడిని 'మీ సుదీర్ఘ కెరియర్‌లో తర్వాతి పెద్ద అడుగు ఏంటీ?' అని అడిగారు. అందుకు.. తర్వాతి బిగ్ స్టెప్ అంటే.. ప్రస్తుతానికి కచ్చితంగా ఫలానా అని చెప్పలేను. కానీ, వచ్చే వరల్డ్ కప్ గెలవాలని ఉంది. అదే బహుశా నా కెరియర్‌లో మరో పెద్ద అడుగు అని బదులిచ్చాడు కోహ్లీ. అతడి సమాధానం విన్న అక్కడివారంతా చప్పట్లు కొడుతూ భారత స్టార్ ప్లేయర్‌కు మద్దతు తెలిపారు. వెస్టిండీస్ గడ్డపై నిరుడు టీ20 వరల్డ్ కప్ ఫైనల్లో చిరస్మరణీయ ఇన్నింగ్స్ ఆడిన విరాట్.. జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు. సఫారీలను ఓడించి ట్రోఫీ గెలుపొందిన తర్వాత భావోద్వేగానికి గురైన అతడు.. పొట్టి ఫార్మాట్ నుంచి వైదొలుగుతున్నట్టు ప్రకటించాడు. అతడిని అనుసరిస్తూ కెప్టెన్ రోహిత్ శర్మ, రవీంద్ర జడేజాలు టీ20లకు వీడ్కోలు పలికారు.

అప్పటి నుంచి వన్డేలు, టెస్టులకు మాత్రమే అందుబాటులో ఉంటున్నారీ సీనియర్ త్రయం. అయితే.. ఈ మధ్యే ఈ ముగ్గురి సెంట్రల్ కాంట్రాక్ట్‌లో మార్పులు తథ్యమనే వార్తలు వినిపించాయి. ప్రస్తుతం ఏ ప్లస్ విభాగంలో ఉన్న విరాట్, రోహిత్, జడ్డూలను ఏ కేటగిరీ ఆటగాళ్లుగా పరిగణించాలని బీసీసీఐ భావిస్తుందనే కథనాలు ప్రసారమయ్యాయి. ఈ నేపథ్యంలో తాను దక్షిణాఫ్రికా, జింబాబ్వే సంయుక్తంగా ఆతిథ్యమిస్తున్న 2027 వన్డే వరల్డ్ కప్‌లో ఆడాలని భావిస్తున్నట్టు విరాట్ చెప్పడంతో





రిటైర్మెంట్ ఇప్పట్లో లేనట్టే అని అభిమానులు మురిసిపోతున్నారు. ప్రస్తుతం 36 ఏళ్లున్న కోహ్లీ.. ఫిట్‌నెస్ రీత్యా, ఫామ్ రీత్యా.. వరల్డ్ కప్ టోర్నీలో ఆడేందుకు అన్ని విధాలా అర్హుడే. ఇప్పటికే 2011 వన్డే వరల్డ్ కప్, 2013 ఛాంపియన్స్ ట్రోఫీ, ఈమధ్యే ఛాంపియన్స్ ట్రోఫీ గెలుపొందిన జట్టులో సభ్యుడైన విరాట్ మరొక వరల్డ్ కప్ ఆడి.. ట్రోఫీని ముద్దాడితే చూసి తరించాలని ప్రతి ఒక్కరి కోరిక.



# ఆటోలో వెళ్లేందుకు రోజూ 30 రూపాయలు.. ఆలూ పరాటా అంటే ఇష్టం..

ఇండియన్ ప్రీమియర్ లీగ్ ప్రతి సీజన్‌లో కొత్త తారలు పుట్టుకొస్తుంటారు. ఈసారి కూడా కొందరు కుర్రాళ్లు అరంగేట్రంలోనే తమ సంచలన ప్రదర్శనతో జట్టు విజయాల్లో భాగమవుతున్నారు. ముంబై ఇండియన్స్ స్క్వాడ్‌లో అలాంటి యువకెరటాలు ఇద్దరున్నారు. ఒకరు స్పిన్నర్ విఘ్నేశ్ పుతూర్ కాగా.. మరొకరు పేస్ సంచలనం అశ్వనీ కుమార్. 18వ సీజన్‌లో వరుస పరాజయాలతో అల్లాడుతున్న ముంబై జట్టు వాంఖడేలో అద్భుత విజయం సాధించడంలో కీలక పాత్ర పోషించాడీ 23 ఏళ్ల పేస్ గన్. డిఫెండింగ్ ఛాంపియన్ కోల్‌కతా నైట్ రైడర్స్ బ్యాటర్లను వణికిస్తూ 4 వికెట్లతో చెలరేగిన అశ్వనీ ఒక పేదింటి బిడ్డ. ఐపీఎల్ స్టార్‌గా ప్రశంసలు అందుకుంటున్న అశ్వనీది పంజాబ్. క్రికెటర్ అవ్వాలనుకున్న అతడి కలను నిజం చేసేందుకు అతడి తల్లిదండ్రులు ఎంతో కష్టపడ్డారు. 'మాది పేద కుటుంబం. అయినా సరే మా అబ్బాయి కలను సాకారం చేయాలనుకున్నాం. మా స్థోమతకు మించిన ఖర్చు అని తెలిసినా సరే.. మా కుమారుడిని మొహాలీలోని పంజాబ్ క్రికెట్ అకాడమీలో చేర్పించాం.

# ప్రతిష్ఠాత్మక ట్రోఫీకి మంగళం

## ఇంగ్లండ్ బోర్డు కీలక నిర్ణయం..!





ఇంగ్లండ్ క్రికెట్ బోర్డు కీలక నిర్ణయం తీసుకుంది. స్వదేశంలో భారత జట్టుతో ఐదు టెస్టుల సిరీస్‌లో విజేతలకు బహూకరించే పటౌడీ ట్రోఫీకి మంగళం పాడనుంది. ఇంగ్లండ్, వేల్స్ క్రికెట్ బోర్డులు తీసుకున్న ఈ నిర్ణయానికి ప్రత్యేక కారణం ఏంటి? అనేది మాత్రం తెలియడం లేదు. అయితే.. ఇరుదేశాలకు చెందిన దిగ్గజ ఆటగాళ్ల పేరును ఖరారు చేయాలని ఈసీబీ భావిస్తోందట. జూన్, జూలైలో భారత్, ఇంగ్లండ్‌ల మధ్య జరిగే ద్వైపాక్షిక సిరీస్‌లో కొత్త పేరుతో ట్రోఫీని అందించే అవకాశముందని సమాచారం. కానీ, ఈ విషయంపై ఈసీబీ అధికారిక ప్రకటన చేయాల్సి ఉంది. భారత మాజీ క్రికెటర్ మన్సూర్ అలీ ఖాన్ పటౌడీ గౌరవార్థం ఇంగ్లండ్ల బోర్డు 2007లో పటౌడీ ట్రోఫీని ప్రవేశపెట్టింది. అప్పటినుంచి తమ దేశంలో టీమిండియా టెస్టు సిరీస్ ఆడి, విజేతగా నిలిస్తే పటౌడీ ట్రోఫీని ఇచ్చేది. అదే.. ఇంగ్లండ్ జట్టు భారత్‌లో ఆడితే.. బీసీసీఐ మాజీ అధ్యక్షుడు ఆంథోని డి మెల్లో ట్రోఫీ పేరుతో సిరీస్ నిర్వహించేది బీసీసీఐ. అయితే.. ఆంథోని 1987 కాలం చేయగా.. పటౌడీ 2011లో మరణించారు. దాంతో.. వీళ్లిద్దరి పేర్ల బదులు ఇరుదేశాలకు చెందిన క్రికెట్ లెజెండ్స్ పేర్లతో ట్రోఫీని నిర్వహించాలని ఈసీబీ నిర్ణయానికి వచ్చింది. జూన్‌లో రోహిత్ శర్మ సేనతో జరుగబోయే ఐదు టెస్టు సిరీస్‌లోపు ట్రోఫీ కొత్త పేరేంటో తెలియనుంది.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com